ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

గురువారం 29 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 133 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

డిజిటల్ అరెస్ట్ అనేది ఓ దారుణమైన దోపిడీ

సైబర్ నేరగాళ్లను కఠినంగా శిక్షించాలి: సుప్రీంకోర్టు



2



పాక్‌కు భారత్ ఆహ్వానం

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి!

ఢిల్లీలో జరిగే ఎస్‌సీఓ సదస్సు

2



తాగు నీటి సమస్య రాకూడదు

క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి

భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి

తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, అక్టోబర్ 28 (సింగిడి)



కరువును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనలతో కార్యాచరణ

తెలంగాణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం

నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరువును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనలతో కార్యాచరణ

2

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అఖిలపక్ష నేతల సూచనల మేరకు కార్యాచరణ రూపొందిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అంతరాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ ప్రయోజనాలతో పాటు రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

-హైదరాబాద్, అక్టోబర్ 28 (సింగిడి)

ప్రభుత్వ సేవల్లో ఏఐ

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం

2

'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క

రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం

ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి

బ్యాలెట్ సమరంలో కాంగ్రెస్ ఢీలా

4 రాష్ట్రాలు.. 28 స్థానాలు.. కాంగ్రెస్ 'జీరో'

2

కర్ణాటక, యూపీ, బిహార్, మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాభవం

పాలనలో ఉన్న కర్ణాటకలోనే 4 స్థానాలూ ఊడ్చేసిన బీజేపీ-జేడీఎస్ కూటమి

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే స్వంత ఇలాకాలోనే బీజేపీ అభ్యర్థి ఘన విజయం



నాలుగు రాష్ట్రాల్లో జరిగిన 28 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోయింది. సొంత పాలన ఉన్న కర్ణాటకలోనూ క్లీన్ స్వీప్ కావడంతో హస్తం పార్టీ తీవ్ర ఇరకాటంలో పడింది.

-న్యూఢిల్లీ (సింగిడి)

మళ్లీ కరువు వైపు పాలమూరు

ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా కరువు జిల్లా గా ఉన్న పాలమూరు మళ్లీ కరువు వైపు అడుగులు వేస్తున్నది. పాలకుల నిర్లక్ష్యంతో పాటు వాతావరణ పరిస్థితులు ఆ పెద్దజిల్లాను కరువు వైపు తోస్తున్నవి.ఉమ్మడి పాలమూరు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో ఖరీఫ్ సాగుపై ప్రభావం పడుతోంది.

- మహబూబ్ నగర్ బ్యూరో –సింగిడి

- 17 శాతం లోటుతో ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు
- గద్వాల, నారాయణపేటలో అన్ని మండలాల్లో తీవ్ర కరువు
- మిగతా జిల్లాల్లోనూ కరువు సెగ
- జాబితాలో లేని ప్రాంతాల రైతుల్లోనూ ఆందోళన
- ఆరుతడి పంటలు, నీటి పొదుపుపై దృష్టి

రాష్ట్రవ్యాప్తంగా 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో 111 మండలాలు తీవ్ర కరువు, 254 మండలాలు మోస్తరు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు వర్గీకరించింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 740.6 మి.మీ. కాగా, 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. సాధారణంతో పోలిస్తే 17 శాతం లోటు కనిపించింది.

గద్వాల, నారాయణపేటలో తీవ్రత

ఉమ్మడి పాలమూరులో జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ రెండు జిల్లాల్లోని మొత్తం 13 చొప్పున మండలాలనూ ప్రభుత్వం తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. వర్షాధారంగా పంటలు సాగు చేసే రైతులకు ఈ పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారాయి.



మిగతా జిల్లాలకూ కరువు సెగ

మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లోనూ కరువు ప్రభావం కనిపిస్తోంది. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్‌లో 13 చొప్పున, వనపర్తిలో 11 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. అయితే, ఆయా జిల్లాల్లోని అన్ని మండలాలూ ఈ జాబితాలో లేవు. అధికారికంగా మినహాయింపు పొందిన ప్రాంతాల్లోనూ వర్షాల పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా పంటల పరిస్థితి, నేలలో తేమ, నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

ఆరుతడి పంటలపై ప్రోత్సాహం

వర్షాలు సహకరించని పరిస్థితుల్లో తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించడం కీలకం. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం, అవసరానికి మించి సాగునీరు వృథా కాకుండా చూడటం కూడా ముఖ్యం. పంట ఎంపికలో నేల స్వభావం, స్థానిక వాతావరణం, నీటి వనరులు, మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

రైతులకు సకాలంలో సహాయం అవసరం

కరువు మండలాల ప్రకటనతోనే రైతుల సమస్యలు పరిష్కారం కావు. పంట నష్టాల అంచనా, అర్హులకు పెట్టుబడి రాయితీ, తాగునీటి సరఫరా, పశువులకు మేత వంటి అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించాలి. జాబితాలో ఉన్న ప్రాంతాలతో పాటు, మినహాయించిన మండలాల్లోనూ పరిస్థితులను పర్యవేక్షించాలి. వర్షాభావం వల్ల నష్టపోయే రైతులకు సకాలంలో భరోసా కల్పించడం, నీటి వనరులను కాపాడటం ఇప్పుడు అత్యంత కీలకం.

ఏపీలో అర్నబ్ బీభత్సం

వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి



అర్నబ్ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు దంచికొడుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల వరద ఉద్ధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోవైపు వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృత్యువాత పడ్డారు.

2

అర్నబ్ తుపాను ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు

రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన

కోస్తాంధ్ర, యానాంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

తీరం వెంబడి గంటకు 110 కి.మీ వేగంతో బలమైన గాలులు

పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో కుండపోత వాన

ఏపీలో అర్నబ్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రహదారులు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మరికొన్ని చోట్ల ఇళ్లు ధ్వంసం కావడంతో పాటు ఇంటి పై కప్పులు లేచిపోయాయి.

-విశాఖపట్నం (సింగిడి)

ఒడిశా, తమిళనాడు అతలాకుతలం

సురక్షిత ప్రాంతాలకు లక్ష మంది

విమానాలు, రైళ్లు రద్దు

అర్నబ్ తుపాను చెన్నై, ఒడిశాపై ప్రభావం

2

ఒడిశాలో వంతెన కూలి గ్రామాలకు రాకపోకలు అంతరాయం

లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ఏపీకి అండగా తెలంగాణ

ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను

విపత్తులో సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం

ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన డిప్యూటీ సీఎం భట్టి

విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ

తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి

ఇప్పటికే సహాయక చర్యల కోసం

6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

2



తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

కీలక శాఖలకు కొత్త అధికారులు

పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్

జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు

2

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

'ఇన్వెస్ట్ తెలంగాణ' కర్టెన్ రైజర్ వేదికగా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై ఫోకస్!

2

రాష్ట్రానికి భారీగా అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టులు ఆకర్షించడమే ప్రధాన అజెండా

పర్యటన సందర్భంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కేంద్ర ప్రముఖులతో భేటీ అయ్యే అవకాశం

తాగు నీటి సమస్య రాకూడదు



ఎల్ నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్‌తో పాటు సీఎంవో, అవుటర్ రింగ్ రోడ్డు, మైట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సీఎం తెలిపారు. పబ్లిక్ పార్కులు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటరేనే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొదన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికిప్పుడు హైడ్రా పర్యవేక్షించాలన్నారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్ ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏపీలో అర్నబ్ బీభత్సం

తుపాను ధాటికి వేలాది ఎకరాల్లో పంటలు నేలకొరిగాయి. దీంతో రైతుల కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. అసలే తీవ్ర కరువుతో ఇబ్బంది పడుతున్న తమకు అర్నబ్ తుపాను తీవ్రనష్టాన్ని మిగిల్చిందని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. అటు పలు చోట్ల రవాణా వ్యవస్థ స్తంభించింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలోనే వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. విశాఖలో విద్యుత్ స్తంభాలు కూలి పాత గోశాల సమీపంలో ఒకరు మృతి చెందగా సింహాచలం బాలాజీనగర్ వద్ద బిందు అనే వివాహిత మరణించింది. దీనిపై సమాచారం అందుకున్న గోపాలపట్నం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం గుడివాడలో విషాదం చోటుచేసుకుంది. వర్షం కారణంగా పాత గోడ కూలి 11 ఏళ్ల బాలుడు దుర్మరణం పాలయ్యాడు.

ఏపీకి అండగా తెలంగాణ

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

ఒడిశా, తమిళనాడు అతలాకుతలం

బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను బీభత్సం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తమిళనాడులో జనజీవనాన్ని ప్రభావితం చేసింది. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిశాయి. ఒడిశాలో చెట్లు కూలి రహదారులు మూసుకుపోగా, కొన్ని ప్రాంతాల్లో వంతెన కూలడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 234 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 73 మంది మహిళలకు సురక్షితంగా ప్రసవాలు జరిగాయి. మరోవైపు చెన్నై విమానాశ్రయంలో 12 విమానాలను రద్దు చేయగా, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించారు.

గజపతిలో 30 చోట్ల రహదారులు మూసివేత

తుపాను ప్రభావంతో ఒడిశాలోని గజపతి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో పెద్దపెద్ద చెట్లు నేలకూలడంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నదులు, వాగుల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఆర్.ఉదయగిరి బ్లాక్‌లోని కైరఢెప్ వాగులో నీటిమట్టం పెరగడంతో కానకట-పురుణపాణి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో సుమారు 30 ప్రాంతాల్లో చెట్లు కూలి రహదారులు మూసుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో దాదాపు 25 ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మోహన ప్రాంతంలోని గుండరీగుడా వంతెన కూలిపోవడంతో నదికి అవతలి వైపున ఉన్న నాలుగు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ సేవల్లో ఏఐ

హైదరాబాద్, అక్టోబర్ 28 (సింగిడి)

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షిమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమ గీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు.

అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 28 (సింగిడి)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రేపు దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. రాష్ట్రానికి భారీ ఎత్తున విదేశీ, దేశీయ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణలో పారిశ్రామిక అనుకూలతలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు వివరించనున్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్లకు తెలంగాణ ఆహ్వానం

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా సరికొత్త పరిశ్రమలు, ఐటీ, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల విస్తరణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ మహా సదస్సుకు సంబంధించిన రోడ్‌మ్యాప్, థీమ్‌ను ఢిల్లీ వేదికగా జరిగే కర్టెన్ రైజర్ ఈవెంట్‌లో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను ప్రముఖ కార్పొరేట్ సంస్థల సీఈవోలు, పారిశ్రామికవేత్తల ముందు ఉంచనున్నారు.

పాక్‌కు భారత్ ఆహ్వానం

న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సింగిడి)

దేశ రాజధాని దిల్లీ వేదికగా జరగబోయే ఎన్‌ఎస్‌ఏ సదస్సుకు హాజరుకావాలని పాక్‌కు భారత్ ఆహ్వానం పంపింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న తరుణంలో ఈ ఇన్విటేషన్‌ను ఇండియా పంపడం గమనార్హం. భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం జరిగింది. దిల్లీ వేదికగా నవంబర్ 20-22 వరకు జరగబోయే షాంఘై సహకార సంస్థ తొలి సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్‌కు పాకిస్థాన్ జాతీయ వారసత్వ, సాంస్కృతిక శాఖ మంత్రి జౌరంగజేబ్ ఖాన్ చిచీని భారత్ ఆహ్వానించింది. అంతేకాకుండా ఈ సదస్సుకు ఎన్‌ఎస్‌ఓలో ఉన్న 10 సభ్య దేశాలనూ ఆహ్వానించింది. ఈ మేరకు భారత దౌత్య వర్గాలు తెలిపాయి. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా క్షీణించాయి. ఏడాది దాటినా ఇంకా భారత్, పాక్ మధ్య సంబంధాలు అంతగా బలపడలేదు. ఈ నేపథ్యంలో పాక్‌కు భారత్ నుంచి ఎన్‌ఎస్‌ఏ సదస్సుకు హాజరుకావాలని అహ్వానం అందడం గమనార్హం.

18 నెలల తర్వాత సీనియర్ పాక్ మంత్రికి ఆహ్వానం

పహల్గాం ఉగ్రదాడి అనంతరం 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన నేపథ్యంలో ఇండియా-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సైనిక చర్య (18 నెలల) తర్వాత ఒక సీనియర్ పాకిస్థాన్ మంత్రికి భారత్ నుంచి ఓ సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానం అందడం ఇదే మొదటి సారి. అంతకుముందు 2023లో గోవాలో జరిగిన ఎస్‌సీఓ విదేశాంగ మంత్రుల సమావేశానికి నాటి పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ హాజరు అయ్యారు. ఇప్పుడు ఎస్‌సీఓ సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్‌కు జౌరంగజేబ్ వస్తే ఒక సీనియర్ పాక్ మంత్రి భారత్‌లో పర్యటించడం గత మూడేళ్లలో ఇదే తొలిసారి కానుంది.

ఉగ్రవాదం పట్ల ఎలాంటి ద్వంద్వ వైఖరి ఉండ కూడదు : రాజ్‌నాథ్

అక్టోబర్ 20న తజికిస్థాన్‌లోని దుషాన్బేలో జరిగిన ఎస్ఈఓ ప్రభుత్వాధినేతల మండలి సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ఫోరమ్‌ను ప్రకటించారు. సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్ కోసం అన్ని ఎస్‌సీఓ సభ్య దేశాలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, అక్టోబర్ 28 (సింగిడి)

తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ



నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు. ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు సైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీవీస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు.

బ్యాలెట్ సమరంలో కాంగ్రెస్ ఢీలా

ఈ ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు బీజేపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలుకావడంపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ ఎన్ని ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచిందో ఊహించాలంటూ ఎద్దేవా చేశారు.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలుకావడంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ ఎన్ని ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచిందో ఊహించాలంటూ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ప్రధాని పోస్టు చేశారు. యూపీ, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరిగాయని మోదీ రాసుకొచ్చారు. అవన్నీ కూడా ప్రతిపక్షాలు కోరుకుంటున్నట్లు బ్యాలెట్ పద్ధతిలోనే జరిగాయని గుర్తుచేశారు.

కర్ణాటకలో కాంగ్రెస్ ఓటమి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ రాష్ట్రంలో ఏ పార్టీ ఎన్నిస్థానాలు గెలుచుకుందో చూద్దాం. కర్ణాటక శాసన మండలిలో రెండు ఉపాధ్యాయ, రెండు పట్టభద్రుల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్‌డీఏ తరఫున ముగ్గురు బీజేపీ అభ్యర్థులు, ఒక జేడీ(ఎస్) అభ్యర్థి బరిలోకి దిగారు. బెంగళూరు ఉపాధ్యాయ స్థానంలో, జేడీ(ఎస్) అభ్యర్థి ఏపీ రంగనాథ్, ఐదుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచిన పుట్టన్నను ఓడించారు. అయితే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఘోరంగా పరాజయం పాలైంది. పోటీ చేసిన నాలుగు స్థానాల్లోనూ ఓడిపోయి ఖాతా తెరవలేకపోయింది. అక్కడ ప్రతిపక్ష జేడీఎస్ (JD-S) అధికార కాంగ్రెస్ నుంచి ఒక స్థానాన్ని కైవసం చేసుకోగా, దాని మిత్రపక్షమైన బీజేపీ మూడు స్థానాలను నిలబెట్టుకుంది.

ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ ఆధిక్యత

ఉత్తరప్రదేశ్‌లో 6 ఉపాధ్యాయ, 5 పట్టభద్రుల నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యత కనబరిచింది. మొత్తం స్థానాల్లో బీజేపీ ఐదు శాసనమండలి స్థానాలను గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ మూడు స్థానాల్లో విజయం సాధించింది.

బిహార్‌లో ఖాతా తెరిచిన జన్ సురాజ్ పార్టీ

ఇక, బిహార్‌లోని 4 స్థానాల్లో ఫలితాలు సమానంగా ఉన్నాయి. బీజేపీ, జేడీయూ, ఆర్‌జేడీ, ఒక స్వతంత్ర అభ్యర్థి ఒక్కో స్థానాన్ని గెలుచుకున్నారు. కాగా, ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని 'జన్ సురాజ్ పార్టీ' అక్కడ ఒక స్థానాన్ని గెలుచుకుని తన ఎన్నికల ఖాతాను తెరిచింది.

మహారాష్ట్రలో బీజేపీ అభ్యర్థి ఘన విజయం

మహారాష్ట్ర శాసనమండలి ఎన్నికల్లో పుణే ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కౌస్తుభ్ గవాడే ఘన విజయం సాధించారు. మొత్తం 28 రౌండ్ల ఓట్ల లెక్కింపు ముగిసేసరికి బీజేపీ అభ్యర్థి కౌస్తుభ్ గవాడేకు 23,117 ఓట్లు సాధించాడు. ప్రత్యర్థి, మిత్ర పక్షమైన శివసేన మద్దతు ఉన్న అభ్యర్థి సచిన్ సనాప్‌పై విజయం సాధించారు. సచిన్ సనాప్‌కు 16,347 ఓట్లు వచ్చాయి. ఈ పోటీలో ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్సీ జయంత్ అసగావ్‌కర్ ఓటమి పాలయ్యారు.

నా జీవితాన్ని వారి ఆశయానికే అంకితం

ఓట్ల లెక్కింపు అనంతరం కౌస్తుభ్ గవాడే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర శాసనసభలో అత్యంత పిన్న వయస్కుల్లో ఒకరిగా ఎన్నికైనందుకు గర్వంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. "ఈ విజయం నా ఒక్కరిదే కాదు. ఈ విజయం ఉపాధ్యాయులందరిగా భావిస్తాను. ఉపాధ్యాయుల హక్కులు, న్యాయం కోసం నేను వీధుల్లో పోరాటం మొదలుపెట్టిన రోజు నుంచే, నా జీవితాన్ని వారి ఆశయానికే అంకితం చేశాను" అని కౌస్తుభ్ పేర్కొన్నారు.

అశ్విన్ వైష్ణవ్ సెటైర్

మరోవైపు, కర్ణాటక శాసన మండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల్లోని నాలుగు స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రముఖంగా పేర్కొన్నారు.



డిజిటల్ అరెస్ట్ అనేది ఓ దారుణమైన దోపిడీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (సింగిడి)

డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని, వారిని కఠినంగా శిక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. డిజిటల్ అరెస్టులపై దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒకచోటకు చేర్చాలన్న నిందితుల పటిషన్ సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. నిందితుల సౌలభ్యం కోసం బాధితులను ఇబ్బంది పెట్టలేమని తేల్చిచెప్పింది. ఈ డిజిటల్ అరెస్ట్ స్కామ్స్‌పై స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ డిజిటల్ అరెస్టు స్కామ్‌లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బలహీనమైన, పదవీ విరమణ చేసిన సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకొని డిజిటల్ అరెస్టులకు పాల్పడుతున్న వారిపై, వారి వెనుకున్న సూత్రధారులపై ఆయన మండిపడ్డారు. డిజిటల్ అరెస్టు అనేది సాధారణం దోపిడీ కంటే చాలా దారుణమైనదని అభివర్ణించారు. "దోపిడీ అనేది అత్యంత సాధారణ నేరం. కానీ డిజిటల్ అరెస్టు స్కామ్‌లు ద్వారా జరిగేది అంతకంటే చాలా పెద్దది. మోసగాళ్లు వీడియో కాల్స్ ద్వారా ఈ మోసాలకు పాల్పడుతున్నారు. వీళ్లు ఏమాత్రం దయ లేని నేరస్థులు. అందుకే వారిని శిక్షించే విషయంలో కూడా అదే విధమైన కఠిన పద్ధతి ఉండాలి. అంతే కాకుండా విచారణకు ముందే వారిని శిక్షించడానికి చట్టంలో ఏమైనా అవకాశం ఉంటే, దానిని కూడా అనుసరించాలి" అని సీజేఐ అన్నారు.

నిందితుల పిటిషన్!

బుధవారం సుప్రీంకోర్టు ముందు హాజరైన పిటిషనర్లలో కొందరు, సైబర్ క్రైమ్ కేసులో నిందితులుగా ఉండడం గమనార్హం. అయితే వారి తరపున హాజరైన న్యాయవాది భిన్నమైన వాదన వినిపించారు. తమ పిటిషనర్లు కూడా సైబర్ దాడుల బాధితులేనని అన్నారు. పిటిషనర్లకు తెలియకుండా, వారి బ్యాంకు ఖాతాలను 'మ్యూల్ అకౌంట్స్'గా సైబర్ నేరగాళ్లు ఉపయోగించారని చెప్పారు. అంతేకాదు తాను కూడా ఈ డిజిటల్ స్కామ్ బాధితుడినేనని ఆయన చెప్పారు. తనకు జరిగిన మోసాన్ని తెలుసుకున్న వెంటనే తాను స్వయంగా జమ్మూకశ్మీర్ అధికారులకు ఫిర్యాదు చేశానని సదరు న్యాయవాది పేర్కొన్నారు.

ఈ కేసుకు సంబంధించి నిధుల స్వీకరణ, మళ్లింపుపై దిల్లీలోని మందిర్ మార్గ్ సైబర్ పోలీసులు ఇప్పటికే దర్యాప్తు చేపట్టారని సదరు న్యాయవాది పేర్కొన్నారు. అందువల్ల ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులను ఒక్కచోటకే చేర్చాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, నిందితుల సౌలభ్యం కోసం బాధితుల హక్కులను కాలరాయలేమని అన్నారు. అలాగే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేసింది. పిటిషనర్ల అభ్యర్థనను కొట్టివేసింది.

కరువును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనలతో కార్యాచరణ

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అఖిలపక్ష నేతల సూచనల మేరకు కార్యాచరణ రూపొందిస్తామని రాష్ట్ర నీటిపారుదల,

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28 (సింగిడి): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు సంబంధిత నాయకులతో నిజాంపేట్‌లో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి నియోజ కవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత పట్ట భద్రుల ఓట్ల జాబితా ఆధారంగా పూర్తి వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకో వాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు అభిమానులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి. గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాష్ట్రం లో కెసిఆర్ గారి నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుం టున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ గారిని మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కానీ నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలి. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత నాయకులు పాల్గొన్నారు.

మల్లికార్జున్ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్



జవహర్ నగర్, అక్టోబర్ 28 (సింగిడి): జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కాలనీ కమిటీ ప్రతినిధులు కోరారు. కాలనీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె. బాలు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సోమవారం జవహర్ నగర్ మాజీ మేయర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా కాలనీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె. బాలు మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన తమ కమిటీకి శుభాకాంక్షలు తెలి యజేసి, అభినందించిన మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌కు ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న తమ కమిటీకి ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ మేయర్ హామీ ఇచ్చా రని వెల్లడించారు. కాలనీలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపార న్నారు. అలాగే, కాలనీ కమిటీ సభ్యులందరూ ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించి, ప్రజల మన్ననలు పొందా లని మాజీ మేయర్ సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కోశాధికారి జలంధర్, సలహాదారులు వెంకటేష్, మహేష్, సారమ్మ, ఈశ్వర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ జోన్‌లో నీటి సరఫరాపై సమన్వయ సమావేశం

అన్ని శాఖలు సమిష్టి కృషితో పనిచేయాలి



రాజేంద్రనగర్, అక్టోబర్ 28 (సింగిడి): ప్రస్తుత నీటి సంక్షోభం, భవిష్యత్తులో తలెత్తే కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా తాగునీరు అందించే దిశగా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కిష్టప్ప అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావే శంలో జలమండలి జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, ఇతర మేనేజర్లు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈఈలతో పాటు పలువురు జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి కొరత సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేం దుకు జీహెచ్ఎంసీ, జలమండలి, మిషన్ భగీరథ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. నీటి వనరులను ఎలాంటి వృధా లేకుండా అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు భవిష్యత్తులో ఎండల తీవ్రత పెరిగే కొద్దీ నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలను రూపొందించారు. నగర ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి, సకాలంలో తగినంత నీటిని సర ఫరా చేసేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్ర మత్తంగా వ్యవహరించాలని కిష్టప్ప సూచించారు. సవాళ్లను ఎదుర్కొనేం దుకు అన్ని శాఖలు సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

రాయితీ శనగ విత్తనాలను
పంపిణి చేసిన ఎమ్మెల్యే



వికారాబాద్ ప్రతినిధి,అక్టోబర్ 28 (సింగిడి): రైతులకు ప్రభుత్వం అధించిన రాయితీతో కూడిన శనగ విత్తనాలను మంగళవారం చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య నవాబుపేట మండల కేంద్రంలో రైతులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగునీటి పంటలు కాకుండా సహజంగా పండించే రబి పంటలలు సాగు చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడగంటుతున్న తరుణంలో రైతులు సహజమైన రీతిలో పండే పంటలను ఎంచుకోవాలని అన్నారు. ముఖ్యకంగా భూమిలో తేమ శాతంను బట్టి విత్తనాలు విత్తు కోవాలని చెప్పారు. అదను లేని భూముల్లో విత్తనాలు వేయడం భూడిదలో పన్నీరు ఛందంగా మారుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో జ్యోతి, స్థానిక సర్పంచ్ నర్సింహా రెడ్డి, ఆయా గ్రామాల సపంచ్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్పి పార్టీ కి నూతన సారథులు

కొడంగల్, అక్టోబర్27(నిన్నాదం) : కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మండలాల వారిగ బిఎస్పి పార్టీ నూతన సారథులను నియమించారు.ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి లు యు.రమేష్ బాబు, కాశీనాథ్ ల చేతుల మీద నియామక పత్రాలు అందజేశారు. నూతన సారథులు గా నియమిం చబడిన వారిలో మద్దూర్ మండల అధ్యక్షుడు గా ఎం. ప్రవీణ్ కుమార్, దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు గా నరేందర్, దుద్యాల మండలాధ్యక్షుడు గా శ్రీనివాస్ మద్దూర్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు గా హన్మంతు, కొడంగల్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు గా అశోక్ లను నియమించారు. ఈకార్య క్రమంలో పార్టీ నాయకులు ఎం.శ్రీనివాస్, కేశవులు, ఎం.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటు నమోదు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయం
ఉద్యోగులు నిరుద్యోగులు ప్రభుత్వానికి అనుకూలంగా లేరు
పట్టభద్రుల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి



కొడంగల్, అక్టోబర్ 28 (సింగిడి): పట్టభద్రుల ఓటు నమోదు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, కుటుంబ పనిగా భావించి పూర్తిచేయాలని మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, కొడంగల్ మాజీఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొస్గి పట్టణంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సన్నాహక సమావే శంలో వారు మాట్లాడుతూ గ్రామాల వారిగా పట్టభద్రుల ను గుర్తించి, ప్రతీ పట్టభద్రుడిని ఓటరు నమోదు చేయించాలని సూచించారు. పట్టభద్రుల ఓటు నమోదులో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఇన్చార్జి లు చాలా చురుకుగా పనిచేస్తున్నారనీ అభినందించారు. గడువు ముగిసే కంటే ముందుగానే వందశాతం పట్టభద్రుల ఓటు నమోదు చేయించాలని పేర్కొన్నారు. రాబో యే పట్టభద్రుల ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ బలపరిచే అభ్యర్థి గెలుపు ఖాయమ న్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు ప్రభుత్వ వైఖరి పట్ల వ్యతిరేకంగా ఉన్నారని, పేర్కొన్నారు. ప్రభుత్వనిర్లక్ష్యవైఖరిని,ఆరుగ్యారంటీల అమలులో వైఫల్యాన్ని, ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు వెంకట్ నర్సిములు, శాసం రామకృష్ణ, నీలప్ప, కోట్ల యాదగిరి, కోట్ల మైపాల్, గోపాల్, మైపాల్ రెడ్డి, మధుసూదన్ యాదవ్, మహేందర్ రెడ్డి, నారాయణరెడ్డి, భీములు, ఎర్రన్ పల్లి శ్రీనివాస్, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లు పంపిణీ



కొడంగల్, అక్టోబర్ 28 (సింగిడి):
కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొస్గి పట్టణంలో మంగళవారం దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ లు పంపిణీ చేశారు. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి కావలి నర్సిములు, కొస్గి మండల అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి కోస్గి బస్ డిపో మేనేజర్ కొత్తపల్లి రాజయ్య హాజరయ్యారు.

వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు
నీటి తరలింపుపై చర్యలు ఏవి

ఎమ్మెల్యే చింత ప్రభాకర్
తాగునీటి కొరత వేళ ట్యాంకర్ల ద్వారా బీర్ల పరిశ్రమలకు నీటి సరఫరా
అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 28 (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, భవిష్యత్తులో నీటి వనరు లపై ఒత్తిడి పెరిగే అవకాశమున్న నేపథ్యంలో తాగునీటి సమస్యను ముం దుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి బీఆర్ ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మరో వైపు వ్యవసాయ బోర్ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించా రు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వ హించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, దామోదరరాజనర్సింహా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా, వ్యవసా య బోర్ల వినియోగం, పరిశ్రమలకు నీటి తరలి ంపు, భూసేకరణ పరిహారం వంటి అంశాలను సమీక్షలో చర్చించారు... ప్రజల దాహార్తిని తీర్చడానికి సరిపడా నీరు లేదని చెబుతున్న అధికారులు, గ్రామాల పరిధిలోని వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు నిరంతరాయంగా నీటిని తరలిస్తున్న వ్యవహారంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యవసా య విద్యుత్‌ను వినియోగించుకుంటూ బోర్ల నుంచి నీటిని తోడిపోసి ట్యాంక ర్లను నింపుతున్నారని, ఈ వ్యవహారం అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల నీటిని ఇతర అవసరాలకు పెద్దఎత్తున తరలిస్తే భూగర్భ జలమ ట్టాలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను పక్కనపెట్టి పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడం ఎంతవరకు సమం జసమని ప్రశ్నించారు. ఈ వ్యవహారం పై అధికారులు సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా నీటిని తరలిస్తున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశముందని నిపుణులు హెచ్చరి స్తున్న నేపథ్యంలో వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచ రణ రూపొందించాలని సూచించారు. సంగారెడ్డి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడ కుండా ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని, అవసరమైన ప్రాంతాల కు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, నీటి వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. లేదంటే ఖాళీ కడవాలతో రోడ్లపైకి వస్తారని హెచ్చరించారు. పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ చేపట్టిన మునిదేవునిపల్లి ప్రాంతంలో కొందరు రైతులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆరోపించా రు. భూముల సేకరణ, పరిహారం పంపిణీ విషయంలో రెవెన్యూ అధికారులు పారదర్శకంగా వ్యవహ రించడం లేదని విమర్శించారు. దళారులు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఇబ్బందులు పెడతామం టూ బెదిరించి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొ న్నారు. భూములు కోల్పోతున్న రైతు లకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పరిహారం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూసేకరణకు సంబంధించిన రికార్డు లను పరిశీలించి, పరిహారం అందని రైతులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్న చింత ప్రభాకర్, నీటి సమస్యను రాజకీయ అంశంగా కాకుండా ప్రజల జీవనాధారానికి సంబంధించిన అత్యంత కీలకమైన సమస్యగా పరిగణించాలని సూచిం చారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టి ప్రజలకు సకాలంలో తాగునీరు అందించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

అనారోగ్య బాలుడికి వైద్య సహాయం

తుడుం శ్రీనివాస్ సేవా కార్యకలాపాలకు ప్రశంసలు



కీసర, అక్టోబర్ 28 (సింగిడి): కీసర సర్కిల్, కీసర గ్రామానికి చెందిన కథ లవణ్య సామ్యూల్ దంపతుల కుమారుడికి చిన్నతనం నుంచి అనారోగ్య సమస్యలు ఉన్నాయి. నెత్తిలో నరాల సమస్య కారణంగా శస్త్రచికిత్స జరిగింది, ప్రస్తుతం కడుపులో పైపు ఉంది. బాలుడి పరిస్థితి తెలుసుకున్న కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ ప్రభుత్వ సహాయం, నాణ్య మైన వైద్యం అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్య క్రమంలో గ్రామ యువనాయకుడు సుమన్ బన్నీ పాల్గొ న్నారు. అలాగే కీసర గ్రామానికి చెందిన ముతంగు సత్తి (64) గత నాలుగు సంవత్సరాలుగా పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నారు. వారి ఇంటిని సందర్శించిన తుడుం శ్రీనివాస్ వైకల్య ధృవీకరణ పత్రం కోసం స్లాట్ బుకింగ్ చేసి సర్టిఫికెట్ అందిన తర్వాత పెన్షన్ దరఖాస్తు చేయడానికి దగ్గరుండి సహాయం చేస్తానని తెలిపారు. అనారోగ్యం, వయస్సు కారణంగా ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు, వైద్య సహాయం అందేలా సమాజ సేవ కొనసాగిస్తానని తుడుం శ్రీనివాస్ తెలిపారు. ఆయన సేవా కార్యక లాపాలను స్థానికులు అభినందిస్తున్నారు.

రాయల్ సోఫా మేకర్స్ షాప్ ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్లు



మల్కాజిగిరి, అక్టోబర్ 28 (సింగిడి): స్వయం ఉపాధి తో యువత ముందుకు వెళ్లాలని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ ప్రధాన రహదారిలో రాయల్ సోఫా మేకర్స్ షాప్ ని మంగళవారం మల్కాజి గిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కార్పొరేటర్ లు వై ప్రేమ్ కుమార్, ఏ కే మురుగేష్ లు షాప్ నిర్వహకుల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ యువత స్వయం ఉపాధిరంగంలో ముందుకు వెళ్లి స్థిరపడాలని, ప్రభుత్వ తరపున స్వయం ఉపాధితో ముందుకు వెళ్లే వారికి ప్రోత్సాహాలు ఉన్నాయని చెప్పారు. షాపు ప్రొప్రైటర్ షేక్ మౌలానా మాట్లాడుతూ అన్ని రకాల సోఫా లను నూతనంగా తయారు చేసి ఇవ్వడంతో పాటు రిపేర్ కూడా చేసి ఇవ్వడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.9 లక్షల వ్యయంతో యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



కాప్రా, అక్టోబర్ 28 (సింగిడి): చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో రూ. 9 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులకు మంగళ వారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన పనులను దశల వారీగా చేపడుతున్నామని, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా మురుగునీటి సమస్యలకు పరి ష్కారం లభిస్తుందని, స్థానిక ప్రజలకు మెరుగైన పారి శుధ్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయ న్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణం గా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయ కులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి కూన శ్రీశైలం గౌడ్





కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28 (సింగిడి): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ను మంగళవారం షాపూర్ నగర్ లోని వారి నివాసంలో చింతల్, గాజుల రామారం, జీడిమెట్ల, కొంపల్లి, దుండి గల్ సర్కిళ్లకు చెందిన పలువురు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి తాగునీరు, అంతర్గత సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలపై స్పందించిన కూన శ్రీశైలం గౌడ్ సమ స్యల పరిష్కారానికి సంబంధిత అధికారు లతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టారు. మిగిలిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజ కవర్గంలోని అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకో వాలని ఆయన సూచించారు. ఇందు కోసం తన కార్యాలయంలో ప్రత్యేక ఏర్పా ట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమ ంలో పలువురు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బెరటాన్ ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 28 (సింగిడి): ఇండోనేషియా దేశంలోని బాలి ద్వీపంలో బెరటాన్ సరస్సు ఒడ్డున కొలువై ఉన్న ప్రసిద్ధ శ్రీ ఉలున్ దాను బెరటాన్ ఆలయాన్ని వంగ రాజేశ్వర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ఘనంగా కల్వకుంట్ల వంశీధర్ రావు జన్మదిన వేడుకలు



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 28 (సింగిడి): కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు 53వ జన్మదిన వేడుకలు పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్ లో సోమవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు దేవాలయాల్లో ఉద యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న కోడూరు, నారాయణరావుపేట, మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ నేతలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను, బ్రెడ్ ను పంపిణీ చేశారు. కె.వి.ఆర్ సేన సభ్యులు పట్టణంలోని అనేక కూడళ్ల వద్ద అన్నదానం నిర్వహించారు. కొండ భూదేవి గార్డెన్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కల్వకుంట్ల వంశీధర్ రావు అభిమానులు రక్తదానం చేశారు. వంశీధర్ రావు సైతం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి, అభిమానులు ఆయనను గజమాలతో, ఖడ్గంతో, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనేక సామాజిక సేవ కార్యక్ర మాలు తమ ఫౌండేషన్ ద్వారా చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నోట్ బుక్స్, పరీక్ష ప్యాడ్స్, మహిళలకు ఉచి తంగా కుట్టు మిషన్ శిక్షణ, విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, నిరుద్యోగులకు డ్రైవింగ్ శిక్షణ ఉచితంగా ఇస్తు న్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు. ఇంతమంది అభిమానాన్ని చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కన్నారావు, కెవిఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

Editorial

ఆకాశంలో అపరిచితం! రహస్యమా.. గూఢచర్య సాంకేతికతా?

రాడార్ తెరపై ఒక్కసారిగా మెరిసిన గుర్తు.. క్షణాల్లో మారిన కదలికలు.. పరిశీలకులను విస్మయానికి గురిచేసిన అపరిచిత వస్తువు! అది అత్యాధునిక గగనతల సాంకేతికతకు సంకేతమా? రహస్య నిఘా ప్రయోగమా? ప్రత్యర్థి దేశాల వ్యూహంలో భాగమా? లేక శాస్త్రవిజ్ఞానానికి ఇంకా అంతుచిక్కని పరిణామమా? ప్రపంచవ్యాప్తంగా గుర్తుతెలియని వైమానిక ఘటనలపై ఆసక్తి పెరగడానికి ఇలాంటి ప్రశ్నలే కారణం. కొన్ని దృశ్యాలకు విమానాలు, వాతావరణ బెలూన్లు, ఉపగ్రహాలు, సహజ దృగ్విషయాల ద్వారా వివరణ లభిస్తుండగా, మరికొన్నింటిపై స్పష్టత రావడం లేదు. ఇక్కడే అసలు సవాలు ఎదురవుతోంది. కంటికి కనిపించిన దృశ్యమే పూర్తి వాస్తవమా? పరికరాల్లో నమోదైన సమాచారం ఎంతవరకు కచ్చితమైనది? ప్రత్యక్ష సాక్షుల అంచనాలు శాస్త్రీయ కొలతలకు సరిపోతున్నాయా? ప్రతి వింతనూ గ్రహాంతర శక్తులతో ముడిపెట్టడం ఎంత తొందరపాటో, ఆధారాలు పరిశీలించకుండానే కొట్టిపారేయడమూ అంతే పొరపాటు. గుర్తుతెలియని వస్తువు అంటే దాని స్వభావం ఇంకా నిర్ధారణ కాలేదని మాత్రమే అర్థం. అనుమానం పరిశోధనకు ఆరంభం కావచ్చు.. కానీ ఆధారాలే వాస్తవాన్ని నిర్ధారిస్తాయి.

వివరణ లేని వింతలు.. వీడని రహస్యాలు!

గుర్తుతెలియని వైమానిక ఘటనలకు సంబంధించిన పాత రికార్డులు, నివేదికలు, వీడియోలను అమెరికా ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చే ప్రక్రియను కొనసాగిస్తోంది. 2026 మే 8న ప్రారంభమైన 'ప్రెసిడెన్షియల్ అన్‌సీలింగ్ అండ్ రిపోర్టింగ్ సిస్టమ్ ఫర్ యూఏపీ ఎన్‌కౌంటర్స్' కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 7న ఐదో విడత పత్రాలను విడుదల చేసింది. ఈ పరిణామం ప్రభుత్వ రికార్డులపై ప్రజలకు ఆసక్తి పెరుగుతున్న విషయాన్ని సూచిస్తోంది. అయితే, పత్రాలు విడుదలైనంత మాత్రాన వాటిలో నమోదైన ప్రతి ఘటన అసాధారణ సాంకేతికతకు సంబంధించినదని భావించలేం. కొన్ని వివరాలు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలపై ఆధారపడగా, మరికొన్నింటిలో వీడియోలు, పరిమిత సెన్సార్ సమాచారం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఒక వస్తువు గాలిలో స్థిరంగా ఉన్నట్లు కనిపించినా, పరిశీలనా కోణం లేదా కెమెరా కదలిక వల్ల అలాంటి భ్రమ ఏర్పడవచ్చు. దాని వేగం, దూరం, దిశలను పరికరాలు కచ్చితంగా నమోదు చేశాయా అన్నదీ పరిశీలించాలి.

ఆకాశంలో అసలేం జరుగుతోంది?

1947 జూలైలో అమెరికాలోని రోస్‌వెల్ వద్ద జరిగిన ఘటన గుర్తుతెలియని వైమానిక వస్తువుల చర్చలో ఇప్పటికీ ప్రస్తావనకు వస్తోంది. అక్కడ లభించిన శకలాలను గ్రహాంతర వాహనానికి సంబంధించినవిగా కొందరు భావించారు. అయితే, 1994లో విడుదలైన అమెరికా వైమానిక దళ నివేదిక వాటిని రహస్య పరిశోధన కోసం ఉపయోగించిన 'ప్రాజెక్ట్ మొగల్' బెలూన్ల కార్యక్రమంతో అనుసంధానించింది. తొలుత అంతుచిక్కనిదిగా కనిపించిన ఘటనకు తదుపరి పరిశీలనతో భిన్నమైన వివరణ లభించవచ్చని ఈ ఉదంతం సూచిస్తుంది. ఇదే దిశలో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా 2023 సెప్టెంబర్ 14న గుర్తుతెలియని వైమానిక ఘటనలపై స్వతంత్ర అధ్యయన బృందం తుది నివేదికను విడుదల చేసింది. నాణ్యమైన చిత్రాలు, కచ్చితమైన కొలతలు, వివిధ పరికరాల నుంచి లభించే సమాచారాన్ని సమన్వయం చేయడం ద్వారా శాస్త్రీయ అవగాహనను మెరుగుపరచవచ్చని నివేదిక సూచించింది. నమ్మదగిన సమాచారం పరిమితంగా ఉండటంతో అనేక ఘటనలపై దృఢమైన నిర్ధారణలకు రావడం కష్టమని పేర్కొంది. ఒక వస్తువు అసాధారణ వేగంతో కదిలిందనే వాదనను నిర్ధారించాలంటే దూరం, సమయం, దిశకు సంబంధించిన కచ్చితమైన కొలతలు ఉండాలి. వేడి ఆనవాళ్లు స్పష్టంగా కనిపించలేదని దానికి చోదక వ్యవస్థ లేదని తేల్చలేం. పరిశీలనా దూరం, వాతావరణ పరిస్థితులు, పరికరాల సామర్థ్యం ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. అందువల్ల ప్రత్యక్ష వాంగ్మూలాలతోపాటు వీడియోలు, రాడార్ నమోదులు, ఇతర సెన్సార్ల సమాచారాన్ని పరస్పరం సరిపోల్చాలి. అవసరమైతే స్వతంత్ర నిపుణుల పరిశీలన కూడా చేపట్టాలి. కనిపించిన వస్తువును గుర్తించడం పరిశోధనకు తొలి అడుగు.. దాని స్వభావాన్ని ఆధారాలతో నిర్ధారించడమే శాస్త్రీయ పరీక్ష.

సందేహాలన్నీ కుట్రలు కావు!

ఆకాశంలో కనిపించే వింతల వెనుక అత్యాధునిక సాంకేతికత ఉందా? రహస్య నిఘా వ్యవస్థల పాత్ర ఉందా? లేక ఇంకా వివరణ లభించని సహజ పరిణామాలా? ఈ ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడం అవసరమే. కానీ అనుమానాన్ని నిర్ధారణగా మార్చాలంటే విశ్వసనీయ ఆధారాలు తప్పనిసరి. ఒక ఘటనకు ఇప్పటివరకు వివరణ లభించలేదని దానిని గ్రహాంతర జీవుల ఉనికికి సాక్ష్యంగా చూపలేం. అలాగే, ప్రతి ఘటననూ సాధారణమైనదిగా కొట్టిపారేయడమూ సరైన పరిశోధనా పద్ధతి కాదు. ప్రభుత్వాలు జాతీయ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని కాపాడుతూనే, ప్రజలకు వెల్లడించగల వివరాలను పారదర్శకంగా అందించాలి. శాస్త్రవేత్తలు అందుబాటులో ఉన్న సమాచారం, పరికరాల కొలతలు, ప్రత్యక్ష వాంగ్మూలాలను నిష్పక్షపాతంగా విశ్లేషించాలి. భారతదేశం కూడా విమానయాన భద్రత, అంతరిక్ష పరిశోధన, నిఘా సాంకేతికతపై అధ్యయనాలు, అంతర్జాతీయ సమాచార మార్పిడికి మరింత ప్రాధాన్యమివ్వాలి. ఇటువంటి పరిశోధనలు అంతుచిక్కని రహస్యాలను ఛేదించడమే కాకుండా, గగనతల ముప్పులను గుర్తించడానికి, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయి. ప్రతి రహస్యమూ కుట్ర కాదు.. ప్రతి వింతా అద్భుతం కాదు.. ప్రతి అనుమానమూ సాక్ష్యం కాదు. ఆకాశంలో అపరిచిత దృశ్యం ఎదురైనప్పుడు దాని వెనుక గూఢచర్య సాంకేతికత ఉందా, సహజ పరిణామమా, మరేదైనా కారణమా అన్నది తేల్చేది ఊహాగానాలు కాదు.. నిష్పక్షపాత పరిశీలన, శాస్త్రీయ విశ్లేషణ, విశ్వసనీయ ఆధారాలే.

వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ఫోన్: 9640466464

రోడ్డు పన్ను కట్టాక.. మళ్లీ టోల్ భారం ఎందుకు?

ఒక మధ్యతరగతి కుటుంబం కారు కొనుగోలు చేయాలంటే వాహనం ధరతోపాటు జీఎస్‌టీ, రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్, బీమా వంటి ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఇన్ని చెల్లించిన తర్వాత జాతీయ రహదారిపై ప్రయాణించేందుకు మళ్లీ టోల్ రుసుము చెల్లించాల్సి రావడం సామాన్య వాహనదారుడికి అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. రోడ్డు పన్ను చెల్లించిన తర్వాత మళ్లీ టోల్ ఎందుకు? ఈ ప్రశ్నకు ప్రభుత్వాలు ప్రజలకు మరింత స్పష్టంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అయితే రోడ్డు పన్ను, టోల్ రుసుము చట్టపరంగా వేర్వేరు. వాహనాలపై విధించే పన్నులు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చుతాయి. జాతీయ రహదారుల వినియోగ రుసుము మాత్రం సంబంధిత చట్టాలు, నిబంధనలు, ప్రాజెక్టుల ఒప్పందాల ప్రకారం వసూలు చేస్తారు. కాబట్టి రెండు చెల్లింపులు ఉన్నాయనే కారణంతోనే టోల్ వసూళ్లన్నీ చట్టవిరుద్ధమని చెప్పలేం. కానీ వాటి అవసరం, వసూళ్ల విధానం, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రశ్నించే హక్కుమాత్రం వాహనదారులకు ఉంది.



60 కిలోమీటర్ల నిబంధన.. అమలు ఎలా?

జాతీయ రహదారుల ఫీజు నిర్ణయం, వసూళ్లకు సంబంధించిన 2008 నిబంధనల్లోని రూల్ 8 ప్రకారం, ఒకే జాతీయ రహదారిపై ఒకే దిశలో ఉన్న సాధారణ టోల్ ప్లాజాల మధ్య సాధారణంగా 60 కిలోమీటర్ల దూరం ఉండాలి. అయితే అమలు సంస్థ అవసరమని భావించి, కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేస్తే ఈ దూరానికి మినహాయింపులు ఇవ్వవచ్చు. శాశ్వత వంతెనలు, బైపాస్‌లు, సొరంగ మార్గాలకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు కూడా ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ 2024 ఆగస్టు 1న పార్లమెంటుకు ఇచ్చిన సమాచారంలోనూ స్పష్టం చేసింది. అందువల్ల 40 లేదా 50 కిలోమీటర్ల దూరంలో రెండు టోల్ ప్లాజాలు ఉన్నాయనే కారణంతోనే వాటిని చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించడం సరికాదు. అయితే అలాంటి ప్లాజాలకు అనుమతులు ఎలా ఇచ్చారు? మినహాయింపులకు కారణాలేమిటి? సంబంధిత ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? అన్న అంశాలను పరిశీలించాలి.

10 సెకన్లలో ప్రయాణం.. 100 మీటర్ల క్యూ దాటితే?

టోల్ ప్లాజాల వద్ద వాహనదారులు ఎదుర్కొనే మరో సమస్య నిరీక్షణ సమయం. టోల్ వసూళ్ల వల్ల ప్రయాణ సమయం వృథా కాకుండా చూసేందుకు 2021 మే 26న ఎన్‌హెచ్‌ఏఐ మార్గదర్శకాలను ప్రకటించింది. వాటి ప్రకారం పీక్ అవర్స్‌లోనూ ఒక్కో వాహనానికి సర్వీస్ సమయం 10 సెకన్లకు మించకుండా ఏర్పాట్లు చేయాలి. ఒక లేన్‌లో టోల్ బూత్ నుంచి వాహనాల క్యూ 100 మీటర్లకు మించితే, క్యూ తగ్గేవరకు ఆ లేన్‌లో బారియర్ ఎత్తి టోల్ చెల్లింపు లేకుండా వాహనాలను అనుమతించే విధానం పేర్కొన్నారు. మరి క్షేత్రస్థాయిలో ఈ మార్గదర్శకాలు ఎంతవరకు అమలవుతున్నాయి? టోల్ ప్లాజాల వద్ద 100 మీటర్ల గుర్తులు స్పష్టంగా ఉన్నాయా? క్యూ పెరిగినప్పుడు నిబంధన ప్రకారం చర్యలు తీసుకుంటున్నారా? వాహనదారుల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం లభిస్తోందా? ఈ అంశాలపై ఎన్‌హెచ్‌ఏఐ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, అమలు వివరాలను ప్రజలకు వెల్లడించాలి.

నిర్మాణ ఖర్చు వసూలైతే టోల్ ఎందుకు కొనసాగుతోంది?

టోల్ వసూళ్లపై ప్రజల్లో ఉన్న అతిపెద్ద సందేహం ఇదే. రహదారి నిర్మాణానికి అయిన ఖర్చు వసూలైన తర్వాత కూడా టోల్ కొనసాగడంపై అనేకమంది ప్రశ్నిస్తున్నారు. కానీ అన్ని ప్రాజెక్టులకు ఒకే విధమైన గడువు లేదా వసూళ్ల ముగింపు నిబంధన ఉండదు. కొన్ని ప్రాజెక్టుల్లో నిర్మాణం, నిర్వహణ, పెట్టుబడిపై రాబడి, ఒప్పంద కాలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. కొన్ని చోట్ల ఒప్పంద నిబంధనలు, అధికారిక నోటిఫికేషన్ల ప్రకారం వసూళ్లు కొనసాగుతాయి.

అందుకే ప్రతి టోల్ ప్లాజాకు సంబంధించి ప్రాజెక్టు నిర్మాణ వ్యయం ఎంత? ఇప్పటివరకు ఎంత వసూలైంది? నిర్వహణకు ఎంత ఖర్చు చేస్తున్నారు? ఒప్పందం ఎప్పటివరకు అమల్లో ఉంటుంది? టోల్ వసూళ్లు ఎప్పుడు ముగుస్తాయి? అనే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

ఆడిట్ నివేదికల్లో ఏవైనా అవకతవకలు బయటపడితే వాటిపై చర్యలు తీసుకోవాలి

ఆధారాలు లేకుండా కాంట్రాక్టర్లు లేదా ఇతరులపై ఆరోపణలు చేయడం కంటే, లెక్కలను బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేయడమే ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడుతుంది.

FASTag ఉన్నా సమస్యలెందుకు?

FASTag వ్యవస్థ వల్ల నగదు చెల్లింపుల అవసరం తగ్గి, టోల్ వసూళ్లు వేగవంతమయ్యాయి. అయినప్పటికీ బ్యాలెన్స్ ఉన్నా సాంకేతిక సమస్యలతో చెల్లింపులు విఫలమవడం, ఒకే ప్రయాణానికి రెండుసార్లు డబ్బు కట్ కావడం, రీఫండ్ ఆలస్యం కావడం వంటి ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో వాహనదారులు లావాదేవీ వివరాలు, ఎస్ఎంఎస్ సందేశాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లను భద్రపరచుకోవాలి. సంబంధిత ఫాస్ట్యాగ్ జారీ సంస్థకు లేదా బ్యాంకుకు ఫిర్యాదు చేయాలి. పరిష్కారం లభించకపోతే సంబంధిత అధికారిక ఫిర్యాదు వ్యవస్థలను ఆశ్రయించవచ్చు. పరిస్థితిని బట్టి వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్‌ను కూడా సంప్రదించే అవకాశం ఉంటుంది. అదేవిధంగా టోల్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, వాహనదారులపై దాడి చేయడం వంటి ఘటనలు జరిగితే వాటిని తేలికగా తీసుకోకూడదు. ఫిర్యాదు, సాక్ష్యాలు, సంఘటన వివరాల ఆధారంగా పోలీసులు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. టోల్ చెల్లింపుపై వివాదం ఉన్నంత మాత్రాన ఎవరికీ దౌర్జన్యం చేసే హక్కు ఉండదు.

ప్రజలకు పారదర్శకత కల్పించాలి

టోల్ వసూళ్లపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకోవాలి. మొదటిది: ప్రతి టోల్ ప్లాజాకు సంబంధించిన అనుమతి ఉత్తర్వులు, వర్తించే ఫీజు నోటిఫికేషన్, ప్రాజెక్టు ఒప్పంద కాలం, నిర్వహణ బాధ్యతలు, ఫిర్యాదుల పరిష్కార వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి. రెండోది: 60 కిలోమీటర్ల దూర నిబంధనకు మినహాయింపులు ఇచ్చిన సందర్భాల్లో, అందుకు సంబంధించిన కారణాలను ప్రజలకు సులభంగా తెలుసుకునే విధంగా వెల్లడించాలి. మూడోది: టోల్ వసూళ్లు, నిర్వహణ ఖర్చులు, ఒప్పందాల అమలు, ఫిర్యాదుల పరిష్కారంపై క్రమం తప్పకుండా ఆడిట్, తనిఖీలు నిర్వహించాలి. లోపాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నాలుగోది: డబుల్ డిడక్షన్, సాంకేతిక సమస్యలు, అనుచిత ప్రవర్తన వంటి ఫిర్యాదులకు గడువుతో కూడిన పరిష్కార వ్యవస్థ ఉండాలి. టోల్ ప్లాజా వద్ద ఫిర్యాదు అధికారి వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలి. ఐదోది: సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సంబంధిత రికార్డులు, అనుమతులు, వసూళ్ల వివరాలను చట్ట నిబంధనలకు అనుగుణంగా అందించాలి.

ప్రజా ప్రయోజనమే ప్రభుత్వాల లక్ష్యం కావాలి!

జాతీయ రహదారుల నిర్మాణం, నిర్వహణకు భారీ నిధులు అవసరమే. ప్రయాణికులకు మెరుగైన రహదారులు, భద్రత, వేగవంతమైన ప్రయాణం అందించడం కూడా అంతే ముఖ్యం. అయితే ఆర్థిక భారాన్ని భరిస్తున్న ప్రజలకు తమ డబ్బు ఎలా వినియోగమవుతోంది? టోల్ ఎందుకు వసూలు చేస్తున్నారు? ఎంతకాలం వసూలు చేస్తారు? అనే విషయాలు తెలుసుకునే అవకాశం ఉండాలి. రోడ్డు పన్ను చెల్లించిన తర్వాత టోల్ చెల్లించాల్సి రావడం చట్టవిరుద్ధమా కాదా అన్నదానికంటే, టోల్ వసూళ్లు న్యాయబద్ధంగా జరుగుతున్నాయా? ప్రజలకు తగిన సేవలు అందుతున్నాయా? ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరిస్తున్నాయా? అన్నదే అసలు ప్రశ్న. ప్రజలు ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. ఆ ప్రశ్నలకు ఆధారాలతో సమాధానాలు ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత. టోల్ వసూళ్లలో పారదర్శకత, నిబంధనల అమలు, ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యలపై ప్రభుత్వాలు స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి.

-వి. రాజేందర్ నాథ్
సీనియర్ జర్నలిస్ట్,
9440287170.

అక్కినేనిని సినీ బాట పట్టించిన బలరామయ్య

అక్టోబర్ 29...ఘంటసాల బలరామయ్య వర్ధంతి

ఒక వ్యక్తిని చూడగానే మంచి నటునిగా ఎదిగగల లక్షణాలు ఉన్నాయని నిర్ణయించడంలో సిద్ధహస్తులు ఘంటసాల బలరామయ్య. అలా ఆయన తీసుకున్న నిర్ణయంతో తెలుగు సినిమా ప్రపంచం ఒక గొప్ప మహా నటుడిని పొంద గలిగిన నేపథ్యం మరువ లేనిది. ఆయనే నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. 1947లో బలరామయ్య ఒక రైల్వే ప్లాటిఫారం మీద కనిపించిన వ్యక్తిని చూసి చూడగానే ఆయనకు చిత్ర సీమలో బంగారు భవిష్యత్తు ఉందని ఊహించి, అందించిన ప్రోత్సాహం అక్కినేని జీవితాన్ని మలుపు తిప్పిన క్రమం అది. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించి చిరస్మరణీయ సంఘటనగా నిలిచి పోయింది. అలా అక్కినేని నాగేశ్వర రావు వంటి మహా నటుడి, నట జీవితానికి పునాది వేసిన వ్యక్తి ఘంటసాల బలరామయ్య. అక్కినేని నాగేశ్వరరావు క "సీతారామ జననం" (1944), ద్వారా తెరయోగం కలిగించడమే కాకుండా, ఎ.యన్.ఆర్ .కు వెంటనే రెండవ చిత్రం రావాలని పని గట్టు కొని వేరొక దర్శకుని చుట్టూ తిరిగిన సహృదయులు ఆయన.





పౌరాణిక చిత్రాలతో మొదలుపెట్టి, జానపద, సాంఘిక చిత్రాలను, చారిత్రక చిత్రాలను, ఎంతో వ్యయ ప్రయాసలతో నిర్మించి, విజయ వంతమైన చిత్రాల నిర్మాతగా, దర్శకునిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ప్రత్యేకత సాధించిన ఘంటసాల బలరామయ్య.

ఘంటసాల బలరామయ్య (జూలై 5, 1906 – అక్టోబరు 29, 1953) తెలుగు సినిమా నిర్మాత, దర్శకులు. 1906, జూలై 5న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరు జిల్లా పొట్టెపాలెం గ్రామంలో జన్మించారు.

నాటక రంగంలో ప్రసిద్ధులైన బలరామయ్య సోదరులు రాధాకృష్ణయ్య ప్రోత్సాహంతో వీరికి రంగస్థల అనుభవం కలిగింది. అన్నదమ్ములిద్దరూ 1933లో కలకత్తా వెళ్ళి చిత్రరంగంలో అడుగు పెట్టారు. శ్రీరామా ఫిల్మ్స్, కుబేరా పిక్చర్స్ అనే కంపెనీలు పెట్టి 1936లో సతీ తులసి, 1938లో మార్కండేయ, 1940లో మైరావణ చిత్రాల్ని నిర్మించారు. 1940లో ప్రతిభా పిక్చర్స్ సంస్థను నెలకొల్పి పార్వతీ కళ్యాణం సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తరువాతి కాలంలో చిత్ర నిర్మాణం, దర్శకత్వం రెండు నిర్వహిస్తూ గరుడ గర్వ భంగం (1943), సీతా రామ జననం (1944), ముగ్గురు మరాఠీలు (1946), బాలరాజు (1948), శ్రీ లక్ష్మమ్మ కథ, స్వప్న సుందరి, చిన్న కోడలు (1952) మొదలైనవి తయారు చేశారు.

1944లో నిర్మించిన సీతారామ జననం చిత్రం ద్వారా అక్కినేని నాగేశ్వరరావు, తర్వాత అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు లను తెలుగు చిత్రసీమకు పరిచయం చేశారు. 1948లో నిర్మించిన బాలరాజు సినిమా సాటిలేని విజయాన్ని అందించింది. ప్రతిభా పిక్చర్సు అధినేత ఘంటసాల బలరామయ్య ఎ.ఎన్. ఆర్. తో నిర్మించిన జానపద చిత్రం ముగ్గురు మరాఠీలు విజయవంతం కావడంతో తదుపరి ప్రయత్నంగా 1948 లో అక్కినేని, ఎస్.వరలక్ష్మి, అంజలీదేవి ప్రధాన భూమికలుగా నిర్మించిన చిత్రం బాలరాజు. అంతవరకు తన పాత్రలకు తనే పాడిన నాగేశ్వరరావు ఈ చిత్రం నుండీ ఘంటసాలనే తనకు నేపథ్య గాయకునిగా పాడమనటం జరిగింది. ఘంటసాల ఆయనకు పాడిన తొలిపాట "చెలియా కనరావా". తొలినాట ఎస్.వరలక్ష్మి నటిగానే కాక, నేపథ్యగాయనిగా ఉండేవారు. ఈ చిత్రంలో ఎక్కువ భాగం పాటలు ఆమెవే. అయితే, ఆ చిత్రంలో ఒకే ఒక పాట, అది ఘంట సాలతో "నవోదయం నవోదయం" అనే యుగళ గీతం పాడిన మరొక నేపథ్య గాయని వక్కలంక సరళ. తోటివారిలో పోటీపడి శ్రీ లక్ష్మమ్మ కథ చిత్రాన్ని కేవలం 19 రోజులలో నిర్మించి విడుదల చేశారు.

తెలుగు సినీ రంగానికి వెలలేని సేవలందించిన అయన 1953, అక్టోబరు 29 అర్ధరాత్రిన గుండె పోటుతో పరమ పదించారు. ఆ సమయంలో ఆయన రేచుక్క చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆ చిత్రాన్ని పి.పుల్లయ్య పూర్తి చేశారు. ఆయన అందరూ అభివృద్ధి చెందాలని, సుఖంగా జీవించాలని కోరుకొనే వారు. ఎన్నో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన మనుమడు ఎస్.ఎస్. తమన్ సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494**

బతుకు పోరు

ఇతరుల్ని చూసి ఈర్ష్య పడకు..
నిన్ను చూసి కూడా ఏడిచే వాళ్లుంటారు !

నా టైం బాగుంది, బాగోలేదు అనకు..
నీ కర్మలను నిందించు, టైంను కాదు !

బలవంతంగా ఏదీ ఎవరి నుంచి లాక్కోకు..
నీది కానిది నీతో ఎంతో కాలం ఉండదు !

జీవన ప్రయాణం చిన్నదేం కాదు..
ఆ జర్నీని ఆలస్యంగా మొదలెట్టావు నీవు !

మన మరణ తేదీ ఖరారు అయ్యింది..
మూన్నాళ్ల బతుక్కి ఈర్ష్య, ద్వేషాలెందుకు !

పరుల సంతోష ప్రశంసలకు
ప్రయత్నించకు..
ఇతరుల్ని ఖుషీ చేయడానికి నీ ఖుషీని
కోల్పోకు !

నీ కలల్ని నీవే సాకారం చేసుకోవాలి..
జనులు, టైం నీ వెంట సదా రాకపోవచ్చు
!

నవ్వుతూనే అడ్డంకులు అధిగమించు..
మనసు ముక్కలైనా నవ్వడం మానకు !

బతుకుతో పోరాడి ముందడుగు వేసుకో..
ఒంటరిగా నడిచి గమ్యం చేరడం నేర్చుకో !

ఎవరి నుంచి ఏమీ ఆశించకు మిత్రమా...
అందరూ జీవనపోరాటం చేస్తూనే ఉన్నారు !

గుడికి వెళ్లి ఆశీర్వాదాలు అడగడం తేలిక..
సత్కర్మలను చేయడమే కష్టమైంది మనిషికి !

**మధుపాళీ
9949700037**

బూర్గుల్ గ్రామానికి మళ్లీ బస్సు సౌకర్యం



• ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషితో
గ్రామస్థుల చిరకాల కోరిక నెరవేర్పు

కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 28 (సింగిడి): ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న బూర్గుల్ గ్రామ ప్రజల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని బూర్గుల్ గ్రామానికి బస్సు సౌకర్యం పునరుద్ధరించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవతో గ్రామానికి మళ్లీ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రవాణా కష్టాలకు చెక్!

గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడం, ఉద్యోగులు విధులకు హాజరుకావడం, ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి చేరుకోవడం కష్టతరంగా మారేది. బస్సు సౌకర్యం పునరుద్ధరణతో ఈ సమస్యలకు కొంతమేర పరిష్కారం లభించనుంది.

సర్పంచ్ కృషికి ఫలితం

గ్రామ ప్రజల రవాణా ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ సౌమ్య మోహన్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో బస్సు సౌకర్యం తిరిగి ప్రారంభం కావడంతో గ్రామస్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రజల అవసరాలను గుర్తించి స్పందించిన ప్రజాప్రతినిధుల కృషి ఫలించిందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

గ్రామస్థుల కృతజ్ఞతలు

బూర్గుల్ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు సర్పంచ్ సౌమ్య మోహన్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదల ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతోపాటు విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ఎంతగానో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. గ్రామ ప్రజల చిరకాల సమస్య పరిష్కారం కావడంతో బూర్గుల్‌లో ఆనందం వెల్లివిరిసింది.

వరి దిగుబడి అంచనాకు పంట కోత ప్రయోగం



• పంటల ఉత్పత్తి వివరాల సేకరణలో ప్రయోగాలు కీలకం
• వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి

కామారెడ్డి అక్టోబర్ 28 (సింగిడి): వరి పంట దిగుబడిని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేసేందుకు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం జాప్తి జానకంపల్లి గ్రామంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. జాతీయ గణాంక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా వరి పంట దిగుబడి వివరాలను సేకరించారు. గ్రామానికి చెందిన రైతు గోపాల్ వ్యవసాయ క్షేత్రంలోని సర్వే నంబర్ 41లో ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పుతో మొత్తం 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగాత్మక ప్లాట్‌ను ఎంపిక చేశారు. ఈ విస్తీర్ణంలో పండిన వరి పంటను పరిశీలించి దిగుబడిని అంచనా వేసే ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, పంటల దిగుబడిని కచ్చితంగా అంచనా వేయడంలో పంట కోత ప్రయోగాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించిన వివరాలు పంటల ఉత్పత్తి అంచనాలను రూపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రయోగాల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తుల అంచనాలు రూపొందించడంతోపాటు, భవిష్యత్తులో వ్యవసాయ ప్రణాళికల రూపకల్పనకు అవసరమైన గణాంకాలను సిద్ధం చేయవచ్చని వివరించారు. రైతులకు సంబంధించిన వ్యవసాయ విధానాలు, ప్రణాళికల రూపకల్పనలో విశ్వసనీయమైన దిగుబడి గణాంకాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ గణాంక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కన్సల్టెంట్ జీవరత్నం, ఎస్ఎస్ఓ రాకేష్, డిప్యూటీ ఎస్ఓ రమేష్, డీఎస్ఓ హేమావతి, వ్యవసాయ అధికారి సాయికిరణ్, ఏఈఓ రజిత, సర్పంచ్ వర్షిణి, ఉప సర్పంచ్ బాలరాజు, గ్రామ పంచాయతీ అధికారి రాజు, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు
అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు
బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన సబ్బితం మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 28 (సింగిడి): రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ విజయ రమణారావు అన్నారు. రాష్ట్రములో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు కొనసాగుతున్నాయని తెలిపారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నవారిలో సబ్బితం గ్రామానికి చెందిన చుంచు సదయ్య మాజీ సర్పంచ్, మదాసి శ్రీనివాస్ మాజీ ఉపసర్పంచ్, చుంచు చిన్న పెద్దులు మాజీ ఉపసర్పంచ్, పులిపాక మనోజ రాజయ్య,ఇండ్ల నాగతేజశ్విని – రమేష్, గుమ్మడి రాజేంద్ర ప్రసాద్,
ఆకుల సతీష్ కుమార్, చెప్పాల రాజేశం, పేరుక పోచాలు,చుంచు సారయ్య, చుంచు సంపత్ లతో పాటు పలువురు వార్డు సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు నాయకత్వంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసే తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.?ఈ కార్యక్రమంలో సబ్బితం గ్రామ సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్,మండల పార్టీ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు, మహిళలు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొందాం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం...
కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలిసి మంత్రి సమీక్ష



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 28 (సింగిడి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, డీసీపీ రాంరెడ్డిలతో కలిసి ఎల్‌నినో ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పడిపోతున్న నేపథ్యంలో యాసంగిలో వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించేలా వ్యవసాయ శాఖ అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రానున్న ఏడాది పాటు తాగునీటి సరఫరాకు ఎలాంటి ధోకా లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రజలు నీటిని పొదుపుగా వాడేలా చూడాలన్నారు. 'పీఎం సూర్య ఘర్' పథకం ద్వారా సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, ప్రజాప్రతినిధులందరూ ముందుగా తమ ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే రైతులకు మద్దతు ధర అందేలా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ.. యాసంగిలో వరి సాగును ప్రోత్సహించకుండా బోరుబావుల కింద మొక్కజొన్న, శనగ వంటి తక్కువ నీటితో పండే పంటలు వేసుకునేలా రైతులకు మార్గదర్శనం చేయాలన్నారు. ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకుంటూనే భూగర్భ జలాలు అడుగంటిపోకుండా చూసుకోవాలన్నారు. మిల్లింగ్ కుమ్మక్కు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను బలోపేతం చేసి రైతులకు మెరుగైన ధర దక్కేలా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా పరిస్థితిని వివరిస్తూ.. అక్టోబర్‌లో వర్షాపాతం లేకపోవడంతో భూగర్భ జలమట్టం 5.31 మీటర్లకు పడిపోయిందని తెలిపారు. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నిల్వలను సమర్థంగా వాడుకుంటూ తాగునీటికి 285 రోజులకు పైగా ధోకా లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. నవంబర్ రెండో వారంలో ప్రారంభమయ్యే ధాన్యం కొనుగోళ్ల కోసం 311 కేంద్రాలు సిద్ధం చేస్తున్నామని, గోదాముల్లో స్థల సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రాజెక్టుల డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని తరలించేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సమావేశం అనంతరం 2026-27 వానకాలం వరి మద్దతు ధర, సన్న రకాలకు రూ.500 బోనస్ చెల్లింపులు, సీతమ్మలోది ట్రిక్కింగ్ పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, మున్సిపల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనాభా గణన 2027ను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

అధికారుల సమన్వయంతోనే విజయవంతమైన జనాభా లెక్కింపు
తహసీల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం



కామారెడ్డి, అక్టోబర్ 28 (సింగిడి): జిల్లాలో జనాభా గణన--2027 ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. జనాభా గణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిబంధనలకు అనుగుణంగా సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని స్పష్టం చేశారు. జనాభా గణన నిర్వహణకు సంబంధించి తహసీల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. జనాభా గణన ద్వారా సేకరించే సమాచారం భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో పక్కాగా సమాచార సేకరణ

జనాభా గణనకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రతి అధికారికి పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని సిద్ధంగా ఉండాలని తెలిపారు. సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్దేశిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో జనాభా గణన ప్రక్రియ సజావుగా సాగేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెండో దశ లెక్కింపుపై ప్రత్యేక శిక్షణ

జనాభా గణన--2027లో భాగంగా రెండో దశ జనాభా లెక్కింపునకు సంబంధించి అధికారులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో మాస్టర్ శిక్షకులు డాక్టర్ భుక్య రవికుమార్, ఏ.ఆర్. యుగంధర్ బాబు పాల్గొని జనాభా గణన విధివిధానాలపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ఎలా సేకరించాలి, సేకరించిన వివరాలను ఏ విధంగా నమోదు చేయాలి, ప్రక్రియలో పాటించాల్సిన సాంకేతిక అంశాలు ఏమిటి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను శిక్షకులు వివరించారు. జనాభా గణనలో సమాచార ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

జనాభా గణన విజయవంతంగా పూర్తయ్యేందుకు శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు భావించారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ముఖ్య ప్రణాళిక అధికారి రఘునందన్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని 25 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు చెందిన తహసీల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

చిన్నపాటి గొడవ.. విషాదాంతం!

గేదెను కట్టేసే విషయంలో వివాదం.. సర్దిచెప్పేందుకు వెళ్లిన వృద్ధురాలు మృతి
నేరల్‌తండాలో విషాద ఘటన..
మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 28 (సింగిడి): చిన్నపాటి వివాదాలు క్షణికావేశంలో విషాదాలకు దారితీస్తున్నాయి. పరస్పరం మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన సమస్యలు పట్టింపులు, ఆవేశాలకు దారితీస్తే కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నేరల్‌తండాలో చోటుచేసుకున్న ఘటన ఇందుకు ఉదాహరణగా నిలిచింది. గేదెను కట్టేసే విషయంలో ఇద్దరు మహిళల మధ్య తలెత్తిన వివాదాన్ని సర్దిచెప్పేందుకు వెళ్లిన ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

గేదెను కట్టేసే విషయంలో వివాదం

వివరాల్లోకి వెళితే.. గాంధారి మండలం నేరల్‌తండాకు చెందిన మధురాబాయి (60) ఇంటి సమీపంలో వరుసకు కోడళ్లయ్యే ఇద్దరు మహిళల మధ్య గేదెను కట్టేసే స్థలం విషయంలో వివాదం తలెత్తినట్లు సమాచారం. తమ స్థలంలో గేదెను కట్టేశారనే అంశంపై ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గొడవను ఆపి, ఇరువురికి సర్దిచెప్పాలనే ఉద్దేశంతో మధురాబాయి మధ్యలోకి వెళ్లినట్లు సమాచారం. అయితే వివాదం మరింత ముదరడంతో ఆమె గాయపడినట్లు వార్తా కథనం పేర్కొంది. వెంటనే స్పందించిన తండావాసులు ఆమెను గాంధారి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.

కుటుంబంలో తీరని విషాదం

మధురాబాయి మృతితో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. చిన్నపాటి స్థల వివాదం చివరకు ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన స్థానికులను కలచివేసింది. కుటుంబాల మధ్య తలెత్తే సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.
ఇరుగుపొరుగు వారితో సఖ్యతగా ఉండటం, సమస్యలు ఎదురైనప్పుడు పెద్దల సమక్షంలో చర్చించుకోవడం, వివాదాలు ముదిరే పరిస్థితుల్లో ఆవేశానికి లోనుకాకుండా సంయమనం పాటించడం ఎంతో అవసరం. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు ఒక్క వ్యక్తినే కాకుండా రెండు కుటుంబాల జీవితాలపై ప్రభావం చూపుతాయని ఇలాంటి ఘటనలు హెచ్చరిస్తున్నాయి.

న్యాయం చేయాలని రాస్తారోకో

మధురాబాయి మృతి వార్త తెలియడంతో నేరల్‌తండాలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన తండావాసులు గాంధారి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నాకు దిగినట్లు సమాచారం. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ చౌదరి, ఎస్సై మహేందర్ అక్కడికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని సర్దిచెప్పేందుకు ప్రయత్నించినట్లు అక్షరటుడే వార్తా కథనం వెల్లడించింది. అయినప్పటికీ బాధితులు తమ డిమాండ్లపై ఆందోళన కొనసాగించినట్లు తెలిపింది.

వివాదాలకు సామరస్యమే పరిష్కారం

గ్రామీణ ప్రాంతాల్లో ఇరుగుపొరుగు కుటుంబాల మధ్య స్థలాలు, పశువులను కట్టేసే ప్రదేశాలు, ఇతర చిన్నపాటి అంశాలపై అప్పుడప్పుడు వివాదాలు తలెత్తుతుంటాయి. అయితే ఇలాంటి సమస్యలను పరస్పర చర్చలు, గ్రామ పెద్దల జోక్యం, చట్టబద్ధమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలి. సమస్యను పరిష్కరించాల్సిన సమయంలో ఆవేశానికి లోనైతే పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదం ఉంటుంది. నేరల్‌తండాలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన నేపథ్యంలో వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన పెరగాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. కుటుంబాల మధ్య సఖ్యత, పరస్పర గౌరవం, సంయమనం ఉంటే అనేక సమస్యలు పెద్దవిగా మారకుండా అడ్డుకోవచ్చు.

పోలీసుల విచారణపై ఆసక్తి

ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, బాధ్యులపై తీసుకునే చర్యలు, కేసు దర్యాప్తు పురోగతి వంటి అంశాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన వాస్తవాలను విచారణ ద్వారా నిర్ధారించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చిన్నపాటి వివాదం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపిన ఈ ఘటన.. ఆవేశం కన్నా సంయమనం గొప్పదని, సమస్యలకు గొడవలు కాకుండా చర్చలే పరిష్కారమని ప్రతి ఒక్కరికీ గుర్తుచేస్తోంది.

నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

• రెండున్నర లీటర్ల సారా, టీవీఎస్ బైక్ స్వాధీనం
• ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో పట్టుబడిన నిందితుడు



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 28 (సింగిడి): నాటుసారా అక్రమ రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు నిఘా పెంచారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రెండున్నర లీటర్ల నాటుసారాతో పాటు రవాణాకు ఉపయోగించిన టీవీఎస్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్టోబర్ 28న ఉదయం 11 గంటల సమయంలో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కన్నాపూర్--రామారెడ్డి రహదారిపై సాయిలు పౌల్ట్రీ ఫారం సమీపంలో కన్నాపూర్ తండాకు చెందిన కాట్రోత్ మహిపాల్ (28) తన టీవీఎస్ బైక్‌పై రెండున్నర లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా అధికారులు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న నాటుసారాతో పాటు టీవీఎస్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం అతడిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఎం. శంకర్, అమృత రెడ్డి, రాజు, మహిళా కానిస్టేబుల్ శిరీష పాల్గొన్నారు.

అక్రమ మద్యం తయారీ, రవాణాపై కఠిన చర్యలు

జిల్లా పరిధిలో ఎవరైనా ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మద్య నిషేధ మరియు ఎక్సైజ్ అధికారి బి. ముకుంద రెడ్డి హెచ్చరించారు. నాటుసారా అక్రమ రవాణాకు ఉపయోగించే వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులను స్థానిక మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేస్తామని తెలిపారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, జరిమానాలు చెల్లించని పక్షంలో చట్ట ప్రకారం జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సమాచారం అందించండి.. వివరాలు గోప్యంగా ఉంచుతాం

జిల్లాలో నాటుసారా, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, తయారీ, రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని జిల్లా మద్య నిషేధ మరియు ఎక్సైజ్ అధికారి బి. ముకుంద రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారి ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి

కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగవాన్



కామారెడ్డి, అక్టోబర్ 28 (సింగిడి): రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రహవీర్ 'పీఎం రహత్ పథకాలను జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగవాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్‌లతో కలిసి ఆయన ఈ పథకాల అమలు తీరుపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమైనదని, ఈ లోపు బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరఫున రూ. 25,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. ప్రమాద బాధితులకు సాయం చేసే వారు ఎలాంటి పోలీసు లేదా కోర్టు ఇబ్బందులకు భయపడాల్సిన అవసరం లేదని, వారి హక్కులకు చట్టపరమైన రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఈ బహుమతిని ఏడాదికి గరిష్టంగా 5 సార్లు పొందవచ్చని పేర్కొన్నారు.

రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ. 1.5 లక్షల వరకు ఉచిత (క్యాష్‌లెస్) వైద్యం అందించేందుకు 'పీఎం రహత్' పథకం అందుబాటులో ఉందని కలెక్టర్ వెల్లడించారు. జాతీయ రహదారులతో పాటు ఏ రహదారిపై ప్రమాదం జరిగినా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పోలీసు సూపరింటెండెంట్, జిల్లా రవాణా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి సీఎం అల్పాహార పథకం

ముభష్‌నగర్ పాఠశాలల్లో కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ వైద్యుల అంజన్‌కుమార్



కరీంనగర్, అక్టోబర్28(సింగిడి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారం అందించి, వార

చొప్పదండిని కరువు మండలంగా ప్రకటించాలి



- రైతులు, కూలీలను ఆదుకోవాలి
- డిప్యూటీ తహసీల్దార్‌కు బిజేపీ నాయకుల వినతి
- బిజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి

కరీంనగర్, అక్టోబర్ 28(సింగిడి): చొప్పదండి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారిని ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ గ్రామీణ మండల అధ్యక్షుడు మొగిలి మహేశ్ అధ్వర్యంలో నాయకులు డిప్యూటీ తహసీల్దార్ సర్దార్ మన్మీత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు.కరువు పరిస్థితులతో బావులు ఎండిపోయి, కాలువల ద్వారా నీరు అందక రైతులు పంట నష్టపోతున్నారని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బాధిత రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, పంట రుణాలపై వడ్డీ మాఫీ చేసి, దీర్ఘకాలిక రుణాల చెల్లింపులను వాయిదా వేయాలని కోరారు. వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలకు మూడు సంవత్సరాల పెండింగ్ ఉపాధి సాయం కింద ఒక్కొక్కరికి రూ. 36 వేల చొప్పున చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు పంచాయతీల వారీగా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణగౌడ్, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటలను కాపాడటంలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం

కక్ష రాజకీయాలు పక్కనపెట్టి కాళేశ్వరం జలాలు వెంటనే ఎత్తిపోయాలి

డాక్టర్ దాసరి మమతా రెడ్డి



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 28 (సింగిడి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల సాగునీరు అందక లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే వృథాగా పోతున్న కాళేశ్వరం జలాలను ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంటలను తక్షణమే కాపాడాలని ప్రభుత్వాన్ని నిలదీస్తూ బి ఆర్ ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ రామగుండానికి చెందిన బొద్దు రవీందర్ ఆధ్వర్యంలో మేడిగడ్డ నుండి చేపట్టిన నిరసన సైకిల్ యాత్రకు ఆమె సంపూర్ణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధులతో కలిసి ఆమె సైకిల్ యాత్రను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మమతా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటార్ తో ఎత్తి పోసే నీరు సిద్ధంగా ఉన్నప్పటికీ రైతులకు విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. నీటి లభ్యతపై వెంటనే స్పష్టతనిచ్చి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణను సుభిక్షం చేయడానికి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వాడుకోవడం దారుణమని, ప్రాజెక్టు నిర్వహణలో కేసీఆర్ మార్కు దూరదృష్టిని విస్మరించి రైతుల ఉసురు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి విడుదల విషయంలో 'సెల్ఫ్ డిక్లరేషన్' నిబంధనలు పెట్టి ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవాలని చూస్తోందని ఈ హాస్యాస్పద నిబంధనలను తక్షణమే ఉపసంహరించుకుని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటిని విడుదల చేయాలని సూచించారు. రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడిన ఆమె "రైతు ఏడ్చిన వ్యవసాయం, రాజ్యం ఎన్నటికీ బాగుపడదు" అని అన్నారు.అన్నదాతలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో పోరాటాన్ని ఆపేదే లేదని తేల్చి చెప్పారు.కాళేశ్వరం పరివాహక ప్రాంతాల్లో ప్రతిరోజూ 40 కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణిస్తూ ఎండిపోతున్న పొలాలను చూపుతూ రైతుల ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేస్తున్న నాయకుల కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. కుంభకర్ణ నిద్రలో ఉన్న ప్రభుత్వానికి ఈ యాత్ర కనువిప్పు కావాలని ఆకాంక్షించారు. కాగా ఈ సైకిల్ యాత్ర ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కాశీపాక వాసు, సురేష్, పల్లె మధు, కౌన్సిలర్ విన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ నాంపాని సురేష్ బాబుతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఎంఆర్పీఎస్ గ్రామ స్థాయి నుంచే బలోపేతం కావాలి

రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 28(సింగిడి): మందకృష్ణ మాదిగ ఆశయాల సాధన కోసం, మాదిగల హక్కుల పరిరక్షణ కొరకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాలను పటిష్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆయనకు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట రాములు, సత్తిగారి లక్ష్మి, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు లావణ్య, నాయకులు భూపతి, సాయిలు, రవీందర్, బుజ్జమ్మ లెగ్గెల, రాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే లక్ష్య సాధన సాధ్యం

డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి



కరీంనగర్, అక్టోబర్28(సింగిడి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవరచుకుంటే చదువుల్లో రాణించడంతోపాటు వ్యక్తిత్వ వికాసం సాధించి, లక్ష్యాలను చేరుకోవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, విశ్రాంత ఆచార్యుడు లయన్ కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేకుర్తిలోని ప్యారడైజ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'లక్ష్య సాధన మార్గాలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు గంటలు చదవాలని, సమయపాలన పాటిస్తూ క్రీడలు, వ్యాయామానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. తరగతులను ఏకాగ్రతతో వినడంతోపాటు వివిధ పోటీల్లో పాల్గొంటూ ఎంచుకున్న రంగంలో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ తమ ప్రగతిని మెరుగుపరుచుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల చైర్మన్ పి. ఫాతిమారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్య భవిష్యత్తులో ఉన్నత చదువులకు పునాది అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, 120 మంది పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథిని సన్మానించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల ఏర్పాటు అవసరం

ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ సహకారంతో నూతన విద్యా సంస్థ ఏర్పాటుకు కృషి

ఆల్ఫోర్స్ చైర్మన్ డా నరేందర్‌రెడ్డి



కరీంనగర్, అక్టోబర్28(సింగిడి): విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కరీంనగర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల ఏర్పాటు అవసరమని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్‌రెడ్డి అన్నారు. ఆల్ఫోర్స్ ట్రైనీ టాట్స్ విద్యాలయంలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో ఆయనను సన్మానించారు. ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ సహకారంతో వినూత్న విద్యాసంస్థ ఏర్పాటుకు ఇటీవల విదేశీ పర్యటన పూర్తి చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ సహకారంతో పాఠశాల ఏర్పాటు చేయాలనే ఆలోచన అభినందనీయమన్నారు. గత ఏడాది నరేందర్‌రెడ్డి అందించిన నిస్వార్థ సేవలను గుర్తించి ప్రకటించిన ప్రత్యేక పురస్కారాన్ని ఈ సందర్భంగా ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం. మహేందర్, కార్యదర్శి ఎన్. వేణుగోపాల్, సభ్యులు ఈ. రమేష్, డి. తిరుపతిరెడ్డి, డా. వి. శ్రీనివాస్, వి. రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధన హైస్కూల్లో ఫోక్సోచట్టంపై అవగాహన సదస్సు



ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్టోబర్ 28 (సింగిడి): స్థానిక సాధన హై స్కూల్ ఆవరణలో విద్యార్థులకు ఫోక్సో చట్టం బాలల హక్కుల రక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గుర్తించడం. అత్యవసర సమయంలో చట్టపరమైన సహాయం పొందడం సైబర్ భద్రతపై చైతన్యం తేవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సులో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు యజమాన్యం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.కె ఆరిఫ్, భరోసా సెంటర్ ఎస్సై శ్రీమతి సంధ్య, ఏ హెచ్ టి యు ఎస్ ఐ యుగేందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్ సాయి శ్రీనివాస్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి అనంతలక్ష్మి, 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి దశరథ హాజరయ్యారు ఈ కార్యక్రమానికి సాధన హై స్కూల్ కరస్పాండెంట్ జిట్టా ధనాప రెడ్డి గారు అధ్యక్షత వహించారు.లి
సదస్సులో అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్కే ఆరిఫ్ మాట్లాడుతూ చట్టపరమైన రక్షణలు ఎల్లప్పుడూ పిల్లలకు అందుబాటులో ఉంటాయని వివరించారు భరోసా సెంటర్ ఎస్సై శ్రీమతి సంధ్య, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మధ్య తేడాలు డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించారు. యుగేందర్ మానవ అక్రమ రవాణా నిరోధకం ఆన్లైన్ గేమింగ్ ప్రలోభాలు అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తత అత్యవసర సమయాలలో స్పందించే విధానాలపై తన ప్రాక్టికల్ అనుభవాలను పంచుకున్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీమతి అనంతలక్ష్మి గారు ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ 1098 గురించి వివరించారు.సదస్సులో కరస్పాండెంట్ జిట్టా ధనాపరెడ్డి మాట్లాడుతూ ఫోక్సో చట్టం 2012 గురించి పూర్తిగా అవగాహన కలిగించడం జరిగింది . పాఠశాల స్థాపించి ఇప్పటివరకు ఎంతోమంది డాక్టర్లను తయారు చేయడం జరిగిందన్నారు. పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన పదవ తరగతి విద్యార్థులు ప్రథమ బహుమతి ఆఫ్ షీన్, ద్వితీయ బహుమతి అర్చన, తృతీయ బహుమతిలి ఆలియా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అడ్వకేట్ మల్లేష్ వందన సమర్పణ చేశారు. సదస్సును విజయవంతం చేయడానికి విచ్చేసిన న్యాయమూర్తులకు పోలీసు అధికారులకు బాలల పరిరక్షణ అధికారులకుల ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

రీ సర్వేభారతి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టిపెట్టాలి



ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్టోబర్ 28 (సింగిడి): రీ-సర్వే, భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. బుధవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో రెవెన్యూ అధికారులు, జిల్లాలోని తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో రీ-సర్వే పురోగతి, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమీక్షించారు. రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాలని, భూ భారతి కింద అందిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఆయా మండలాల్లో రీ-సర్వే, భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి ప్రతిరోజూ సాధించిన పురోగతిపై నివేదికలు సమర్పించాలని సూచించారు. పెండింగ్ అంశాల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ,రెవెన్యూ డివిజనల్ అధికారులు తహసీల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అటవీశాఖకు పోలీసుల పూర్తి సహకారం

అటవీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర హామీ



అటవీ సిబ్బందికి అండగా పోలీసు శాఖ

కామారెడ్డి, అక్టోబర్ 28 (సింగిడి): అటవీ ప్రాంతాల పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణతోపాటు అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, పరస్పర సహకారంతోనే క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలమని పేర్కొన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో అటవీ, పోలీసు శాఖల మధ్య సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ శాఖకు సంబంధించిన పలు అంశాలు, క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

సమావేశంలో జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అటవీ ప్రాంతాల పరిరక్షణలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అటవీ సంపదను కాపాడటం, అటవీ ప్రాంతాల్లో విధుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురయ్యే ఇబ్బందులు, ఆయా సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ నుంచి అవసరమైన సహకారం వంటి అంశాలను వివరించారు. అటవీ ప్రాంతాల పరిరక్షణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చర్చించారు. అటవీ చట్టాల అమలు, అటవీ సంపద సంరక్షణ, విధుల నిర్వహణ సమయంలో సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

అటవీ శాఖ అధికారులు ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర సానుకూలంగా స్పందించారు. అటవీ శాఖకు, ఆ శాఖ సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ సమయంలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం బలంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా సాధించగలమని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, అటవీ సిబ్బంది భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

సమన్వయంతోనే మెరుగైన ఫలితాలు

అటవీ సంపదను కాపాడటం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం ప్రభుత్వ శాఖల సమష్టి బాధ్యత అని అధికారులు అభిప్రాయపడ్డారు. అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల మధ్య నిరంతర సమన్వయం కొనసాగితే క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), ఫారెస్ట్ డివిజనల్ అధికారులు (ఎఫ్‌డీవోలు), ఫారెస్ట్ రేంజ్ అధికారులు (ఎఫ్ఆర్‌వోలు) పాల్గొన్నారు.

1064 టోల్ ఫ్రీ నంబర్‌తో అవినీతికి అడ్డుకట్ట

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 28 (సింగిడి): పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు నేతృత్వంలో అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బందితో ఆయన అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అక్రమాల నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పనికైనా అధికారులు లేదా సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు ఇవ్వవద్దని ప్రజలకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలందుకోవడం ప్రజల హక్కని, ఆ హక్కును లంచంతో కొనాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎవరైనా లంచం కోసం వేధిస్తే వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో టీఆర్ఎస్ 'పాంచాజన్య సంకల్ప సభ'ను విజయవంతం చేయండి



మానకొండూర్, అక్టోబర్28(సింగిడి): ఈ నెల 30వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి వేదికగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రక్షణ సేన భారీ బహిరంగ సభ 'పాంచాజన్య సంకల్ప సభ'ను విజయవంతం చేయాలని మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జి చెన్నమల్ల చైతన్య,మానకొండూర్ మండల అధ్యక్షులు వేల్పుల సంపత్ యాదవ్,ఎర్రవెల్లి మహేందర్ పటేల్,ఓల్లాల శ్రీనివాస్ గౌడ్, గువ్వా అభిషేక్ ముదిరాజ్, ప్యాట వేణు కురుమ, నందెల రంజిత్ పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, నియోజకవర్గ కార్యకర్తల భాగస్వామ్యంపై నాయకులు స్పందిస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ అజెండాను, పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సంకల్ప సభ అత్యంత ప్రతిష్టాత్మకమైనదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, వార్డు నుండి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, టీఆర్ఎస్ సైనికులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని కోరారు.

టీజీఎమ్ఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ఒల్లాల శ్రీనివాస్..



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 28 (సింగిడి) : రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తోడుగా నిలుస్తూ వారి కష్టాల పరిష్కారానికి కృషిచేయాలని తెలంగాణ మైనారిటీ గురుకుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఒల్లాల శ్రీనివాస్ కోరారు.?తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య-తెలంగాణ మైనారిటీ గురుకుల విభాగం రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయునికి కీలక బాధ్యతలు లభించాయి. శ్రీనివాస్ కు రాష్ట్ర స్థాయిలో చోటు లభించడం పట్ల ఆయన మిత్రులు, సహోద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన ఇతర రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో డాక్టర్ ఒల్లాల శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఆయనను పలువురు రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్నవివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తూ, ప్రతి ఉద్యోగికి సంఘం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయ సమాఖ్యను మరింత బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమం, ఐక్యత మరియు సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

పోలీస్‌స్టేషన్ పనితీరుపై సీపీ వార్షిక తనిఖీ



కరీంనగర్, అక్టోబర్28(సింగిడి): ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలందిస్తూ, నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులకు సూచించారు. బుధవారం కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి, రికార్డులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కేసులకు సంబంధించిన వస్తువులను భద్రపరచాలని, రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. నిఘా కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, పెట్రోలింగ్ వాహనాలు, ఆధునిక పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఉపయోగంలో లేని పాత సామగ్రిని తొలగించి స్టేషన్ ప్రాంగణాన్ని శుభ్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను త్వరగా పరిష్కరించి, ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ తిరుమల్, ఎస్సైలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టికృషి అవసరం



కామారెడ్డి, అక్టోబర్ 28 (సింగిడి): సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. యువత భవిష్యత్తును కాపాడుతూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణ, నివారణ చర్యలు, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలప



ఈవస్తువులను దిండు కింద పెట్టుకుంటున్నారా?

చాలామందికి నిద్రపోయేటప్పుడు పర్సు, మొబైల్ ఫోన్, తాళాలు, పుస్తకాలు వంటి వస్తువులను దిండు కింద లేదా తల దగ్గర పెట్టుకునే అలవాటు ఉంటుంది. అయితే, వాస్తు నమ్మకాల ప్రకారం, కొన్ని వస్తువులను దిండు కింద పెట్టుకోవడం అశుభకరంగా పరిగణిస్తారు. మరి నిద్రపోయేటప్పుడు దిండు కింద ఉంచకూడదని చెప్పే ఆ వస్తువులు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

1. దిండు కింద పర్సు లేదా పాత బిల్లులను ఉంచవద్దు

చాలామంది తమ పర్సును భద్రత కోసం దిండు కింద పెట్టుకుని నిద్రపోతుంటారు. అయితే, వాస్తు నమ్మకాల ప్రకారం, ఇలా చేయడం మంచిది కాదని చెబుతారు. ముఖ్యంగా పాత బిల్లులు, రసీదులు, అవసరం లేని కాగితాలను దిండు కింద ఉంచడం వల్ల ఆర్థిక విషయాలపై ఆందోళన పెరుగుతుందని కొందరు విశ్వసిస్తారు. అందువల్ల, పర్సును నిర్ణీత ప్రదేశంలో భద్రపరుచుకోవడం, అవసరం లేని పాత బిల్లులను తొలగించడం మంచిది.

2. తాళాలు, గడియారాలను దిండు దగ్గర పెట్టుకోవద్దు

ఇంటి తాళాలు, వాహనాల తాళాలు లేదా లాకర్ తాళాలను దిండు కింద పెట్టుకుని నిద్రపోవడం వాస్తు ప్రకారం శుభప్రదంగా పరిగణించరు. ఇలా చేయడం వల్ల ఇంట్లో ప్రతికూల వాతావరణం ఏర్పడుతుందని కొందరు నమ్ముతారు. అదేవిధంగా, చేతి గడియారం లేదా ఇతర గడియారాలను దిండు కింద పెట్టుకోవడం కూడా నివారించాలని సూచిస్తారు. నిద్రపోయే ప్రదేశాన్ని చక్కగా, ప్రశాంతంగా ఉంచుకోవడం మంచిది.

3. మొబైల్ ఫోన్‌ను దిండు కింద పెట్టుకుని నిద్రపోవద్దు

ప్రస్తుత రోజుల్లో చాలామంది మొబైల్ ఫోన్‌ను దిండు పక్కన లేదా కింద పెట్టుకుని నిద్రపోతుంటారు. అయితే, ఫోన్‌ను దిండు కింద పెట్టుకోవడం కంటే దూరంగా, సురక్షితమైన ప్రదేశంలో ఉంచడం మంచిది. ముఖ్యంగా ఫోన్ ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు దిండుకింద పెట్టుకోవడం వల్ల వేడి పేరుకుపోయే ప్రమాదం ఉంటుంది. నిద్రకు ముందు మొబైల్ వినియోగాన్ని తగ్గించడం కూడా విశ్రాంతికి ఉపయోగపడుతుంది.

4. పుస్తకాలను దిండు కింద పెట్టుకోవద్దు

చదువుతూ నిద్రపోయే అలవాటు ఉన్నవారు పుస్తకాలను దిండు కింద పెట్టుకుంటుంటారు. అయితే, వాస్తు, ఆధ్యాత్మిక నమ్మకాల ప్రకారం, పుస్తకాలను జ్ఞానానికి ప్రతీకగా భావిస్తారు. ముఖ్యంగా సరస్వతీదేవితో జ్ఞానాన్ని అనుసంధానిస్తారు. అందువల్ల పుస్తకాలను గౌరవంగా, శుభ్రమైన ప్రదేశంలో ఉంచాలని సూచిస్తారు. చదివిన తర్వాత పుస్తకాలను పక్కన పెట్టి, ప్రశాంతంగా నిద్రపోవడం మంచిది.

ప్రశాంతమైన నిద్ర కోసం ఏం చేయాలి?

నిద్రపోయే గదిని శుభ్రంగా ఉంచుకోవడం, అవసరం లేని వస్తువులను మంచం మీద లేదా దిండు దగ్గర ఉంచకపోవడం మంచి అలవాటు. మొబైల్ ఫోన్‌ను దూరంగా ఉంచడం, నిద్రకు ముందు ఎక్కువసేపు స్క్రీన్ చూడకుండా ఉండటం, ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పరచుకోవడం ద్వారా నిద్ర నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు.

ఆహా ఏమి రుచి..

వంకాయ ఫ్రై..

ఇలా చేస్తే రెండు ముద్దలు ఎక్కువే తింటారు!



వంకాయ ఫ్రై అనగానే చాలామందికి నచ్చే వంటకం. అయితే ఈ ప్రత్యేకమైన వంకాయ ఫ్రై రెసిపీ సాధారణ వంటకాలకు భిన్నంగా ఉంటుంది. మా ప్రాంతంలో చేసే ఈ విధానం వంకాయ ఫ్రైకి అద్భుతమైన రుచిని, నోరూరించే సువాసనను ఇస్తుంది. వేడి వేడి అన్నంలోకి, చపాతీలోకి, బగారా రైస్‌లోకి ఇది ది బెస్ట్ కాంబినేషన్. ఈ వంకాయ ఫ్రైని ఒకసారి రుచి చూస్తే, మీరు రెండు ముద్దలు ఎక్కువే తింటారు అనడంలో అతిశయోక్తి లేదు.

కావలసిన పదార్థాలు..

లేత వంకాయలు: 5
నీరు: 1 లీటరు
ఉప్పు: రుచికి సరిపడా (మ్యారినేషన్ కోసం 1/2 టేబుల్ స్పూన్)
పసుపు: 1/2 టేబుల్ స్పూన్ (మ్యారినేషన్ కోసం), ఒక చిటికెడు (గ్రేవీ కోసం)
కారం: 1/2 టేబుల్ స్పూన్ (మ్యారినేషన్ కోసం), రుచికి సరిపడా (గ్రేవీ కోసం)
నూనె: 1/2 టేబుల్ స్పూన్ (మ్యారినేషన్ కోసం), 1 టేబుల్ స్పూన్ (వంకాయ వేయించడానికి), 1 1/2 టేబుల్ స్పూన్ (గ్రేవీ)
ఉల్లిపాయ: 1 మీడియం సైజు (పెద్ద ముక్కలుగా కట్ చేసుకోవాలి)
టమాటా: 1 మీడియం సైజు
పచ్చిమిర్చి: 1-2 (మీ కారానికి తగినట్లుగా)
అల్లం: 1 అంగుళం ముక్క
వెల్లుల్లి: 7-8 రెక్కలు
జీలకర్ర: 1-1/2 టేబుల్ స్పూన్
గరం మసాలా: 1/2 టేబుల్ స్పూన్
ధనియాల పొడి: 1/2 టేబుల్ స్పూన్
కొత్తిమీర: తరిగినది (గార్నిష్ కోసం)

తయారుచేయు విధానం..

ముందుగా 5 లేత వంకాయలను శుభ్రంగా కడిగి తీసుకోవాలి. ఒక బౌల్‌లో ఒక లీటరు నీరు తీసుకుని, అందులో 1/2 టేబుల్ స్పూన్ ఉప్పు వేసి పక్కన పెట్టుకోవాలి. వంకాయలను వీడియోలో చూపిన విధంగా రౌండ్‌గా కట్ చేసుకుని వెంటనే ఉప్పు నీటిలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల వంకాయలు నల్లబడకుండా ఉంటాయి. ఉప్పు నీటిలో ఉన్న వంకాయ ముక్కలను ఒక మిక్సింగ్ బౌల్‌లోకి తీసుకుని, అందులో 1/2 టేబుల్ స్పూన్ పసుపు, 1/2 టేబుల్ స్పూన్ కారం, 1/2 టేబుల్ స్పూన్ ఉప్పు, మరియు 1/2 టేబుల్ స్పూన్ నూనె వేసుకోవాలి. ఈ మసాలాలు వంకాయ ముక్కలకు బాగా పట్టేలా చేత్తో గట్టిగా రుద్దుతూ కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న వంకాయలను కనీసం ఐదు నిమిషాల పాటు మూతపెట్టి పక్కన ఉంచుకోవాలి. ఇలా మ్యారినేట్ చేయడం వల్ల వంకాయలకు రుచి బాగా పట్టి, పిల్లలు కూడా ఇష్టంగా తింటారు.

ఈలోపు, ఒక చిన్న మిక్సీ జార్‌లో ఒక మీడియం సైజు ఉల్లిపాయ ముక్కలు, ఒక మీడియం సైజు టమాటా ముక్కలు, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి రెక్కలు, , జీలకర్ర వేసి, ఎలాంటి ముక్కలు లేకుండా మెత్తగా పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పేస్ట్ వంకాయ ఫ్రైకి ప్రత్యేక రుచిని ఇస్తుంది. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి, 1 టేబుల్ స్పూన్ నూనె వేసుకోవాలి. నూనె వేడయ్యాక, మ్యారినేట్ చేసుకున్న వంకాయ ముక్కలను పాన్ సరిపడినంత వరకు వేసుకోవాలి. మీడియం మంటపై ఒక నిమిషం పాటు మూత పెట్టి మగ్గించుకోవాలి. లేత వంకాయలు కాబట్టి త్వరగా ఉడుకుతాయి. తర్వాత, వంకాయలను జాగ్రత్తగా తిప్పి మరో నిమిషం పాటు మూత పెట్టి మగ్గించుకోవాలి. బాగా వేగిన వంకాయ ముక్కలను ఒక ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇవి నోట్లో పెట్టుకుంటే వెన్నలా కరిగిపోతాయి. అదే పాన్‌లో మరో 1 1/2 టేబుల్ స్పూన్ నూనె వేసి, వేడయ్యాక మనం సిద్ధం చేసుకున్న ఉల్లి, టమాటా పేస్ట్‌ను వేయాలి. మీడియం మంటపై ఈ పేస్ట్ పచ్చి వాసన పోయే వరకు వేయించుకోవాలి. రెండు నిమిషాల పాటు మూత పెడితే నూనె పైకి తేలి గ్రేవీ చక్కటి కన్సిస్టెన్సీకి వస్తుంది.

ఇప్పుడు గ్రేవీలోనికి రుచికి తగ్గట్లుగా కారం, ఒక చిటికెడు పసుపు, 1/2 టేబుల్ స్పూన్ గరం మసాలా, 1/2 టేబుల్ స్పూన్ ధనియాల పొడి, మరియు రుచికి సరిపడా ఉప్పు వేసుకోవాలి (వంకాయలకు ఉప్పు కలిపాం కాబట్టి చూసుకుని వేయాలి). ఈ మసాలాలన్నీ గ్రేవీలో బాగా కలిసేలా కలుపుకుని, ఒక నిమిషం పాటు మూత పెట్టి ఉడికించుకోవాలి. నూనె పైకి తేలగానే మరొక్కసారి కలుపుకోవాలి. ముందుగా వేయించి పెట్టుకున్న వంకాయ ముక్కలను గ్రేవీలో వేసి, నెమ్మదిగా కలుపుకోవాలి. వంకాయ ముక్కలకు గ్రేవీ బాగా పట్టేలా చూసుకోవాలి. మంటను నిమ్ ఫ్లేమ్‌లో పెట్టుకోవాలి, లేదంటే అడుగు అంటుతుంది. సన్నగా తరిగిన కొత్తిమీరను పైన చల్లుకుని, రెండు నిమిషాల పాటు సిమ్ ఫ్లేమ్‌లో మూత పెట్టి ఉడికించుకోవాలి. రెండు నిమిషాల తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకుంటే, చాలా టేస్టీగా ఉండే వంకాయ ఫ్రై సిద్ధమవుతుంది. వేడి వేడి అన్నంలోకి, చపాతీకి, లేదా బగారా రైస్‌కి ఇది బెస్ట్ కాంబినేషన్. ఒక్కో ముద్దలో ఒక్కో వంకాయ పీస్‌ని పెట్టుకుని తింటుంటే అద్భుతంగా ఉంటుంది. ఈ రెసిపీని తప్పకుండా ట్రై చేసి, మీ ఫీడ్‌బ్యాక్‌ను తెలియజేయండి.



జియో 3 ఇన్ 1..

ఒకే ప్లాన్‌లో 3 డివైజ్‌లకు రీఛార్జ్..

ఈ ఆఫర్‌ను ఎలా పొందాలి?





ఇంట్లో ప్రత్యేక వై-ఫై, టీవీకి ప్రత్యేక కనెక్షన్, లు చూడటానికి ఓటీటీ యాప్‌లకు ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్. వీటన్నిటి ఖర్చులను భరించడం తరచుగా బడ్జెట్‌ను మించిపోతుంది. కానీ ఇప్పుడు ఈ మూడు సేవలకు వేర్వేరు ప్లాన్‌లు తీసుకోవడానికి బదులుగా, ఇంటర్నెట్, టీవీ, ఓటీటీ ప్రయోజనాలను ఒకే ప్యాక్‌లో పొందే అవకాశాన్ని జియో అందిస్తోంది. రిలయన్స్ జియో జియోహోమ్ ప్యాక్‌లో, వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా టీవీ, వై-ఫై లేదా ఈ మూడు సర్వీసులు కలిపి ఎంచుకోవచ్చు. ఈ ప్యాక్ ప్రారంభ ప్రభావవంతమైన ధర నెలకు రూ. 400.

టీవీ చూడటానికి 400 రూపాయల ఆప్షన్: ప్రధానంగా టీవీ చూడాలనుకునే వారి కోసం జియో టీవీ-ఒన్లీ ప్యాక్ అందుబాటులో ఉంది. ఈ ప్యాక్ ధర 5 నెలలకు 2,000 రూపాయలు, దీని సగటు నెలవారీ ఖర్చు 400 రూపాయలు. ఇందులో 1000కు పైగా లైవ్ టీవీ ఛానెళ్లు, 200కు పైగా ఎణ ఛానెళ్లు, 15కు పైగా ప్రాంతీయ భాషా ఛానెళ్లు ఉంటాయి. ఇది కాకుండా, మీకు 12కు పైగా యాప్‌ల ప్రయోజనం కూడా లభిస్తుంది.

మీకు కేవలం వై-ఫై మాత్రమే అవసరమైతే?: టీవీ లేదా ఓటీటీ ఇంటర్నెట్ ఎక్కువగా అవసరమయ్యే వారి కోసం ప్రత్యేక వై-ఫై ప్యాక్ ఉంది. 30 వీడ్యూా వేగం గల ఐదు నెలల ప్యాక్ రూ. 2,200కు అందుబాటులో ఉంది. అంటే నెలకు సగటున రూ. 440 ఖర్చు అవుతుంది. కాగా, 100 వీడ్యూా వేగం గల 5 నెలల ప్యాక్ ధర రూ. 3,000, దీని సగటు నెలవారీ ఖర్చు రూ. 600.

ఒకే ప్యాక్‌లో ఇంటర్నెట్, టీవీ, ఓటీటీ: జియో 3 ఇన్-1 ప్యాక్ వై-ఫై, లైవ్ టీవీ, ఓటీటీ యాప్‌ల సమిష్టి ప్రయోజనాలను అందిస్తుంది. 30 వీడ్యూా వేగం గల ఈ ప్యాక్ ధర రూ. 2,222, దీని వ్యాలిడిటీ 4 నెలలు. అందువల్ల, సగటు నెలవారీ ఖర్చు సుమారు రూ. 555 ఉంటుంది. ఈ ప్యాక్ 1,000 కంటే ఎక్కువ లైవ్ టీవీ ఛానెళ్లు మరియు 12 ఓటీటీ యాప్‌ల ప్రయోజనాన్ని అందిస్తుంది.

100 వీడ్యూా స్పీడ్ గల రెండవ ఆప్షన్ రూ. 2,122 కు అందుబాటులో ఉంది. ఈ ప్యాక్ 3 నెలల వ్యాలిడిటీతో వస్తుంది. దీని సగటు నెలవారీ ఖర్చు కేవలం రూ. 707 మాత్రమే. ఇందులో ఇంటర్నెట్, టీవీ ఛానెళ్లు, యాప్‌లు కూడా ఉంటాయి. కొత్త కస్టమర్లు తమ అర్హతను బట్టి ఉచిత హోమ్ డెలివరీ ఇన్‌స్టాలేషన్, మెయింటెనెన్స్ సర్వీస్ ప్రయోజనాన్ని కూడా పొందవచ్చు. రీఛార్జ్ చేసే ముందు నిబంధనలను తనిఖీ చేయండి.

స్టాక్ మార్కెట్ Stock Market

కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్లు..

సెన్సెక్స్ 750, నిఫ్టీ 150 పాయింట్లు పతనం



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నాటి ట్రేడింగ్‌లో భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ఒడిదుడుకుల ప్రభావంతో ఆరంభం నుంచే మార్కెట్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లోనే ఏకంగా 750 పాయింట్లకు పైగా నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం కీలక మద్దతు స్థాయిలను కోల్పోయి 150 పాయింట్లకు పైగా పతనమైంది. ముఖ్యంగా ప్రధాన టెక్నాలజీ (IT) రంగ షేర్లు తీవ్రమైన అమ్మకాల ఒత్తిడికి గురై భారీ నష్టాల్లో ట్రేడవుతుండటం సూచీల పతనానికి ప్రధాన కారణంగా మారింది. ప్రముఖ టెక్ దిగ్గజాల కౌంటర్లలో లాభాల స్వీకరణ జోరుగా సాగడంతో ఐటీ ఇండెక్స్ గణనీయంగా క్షీణించింది. మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావంతో బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాలు సైతం ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ పరిణామాలైన అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయంపై వెలువడనున్న సమీక్ష ముందు మదుపర్లు అప్రమత్తత పాటించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. దీనికితోడు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు మరోసారి పైపైకి ఎగబాకడం, డాలరుతో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మరింత బలహీనపడటం దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అలాగే దేశీయ మార్కెట్లో నేడు జియో ప్లాట్‌ఫామ్స్ భారీ ఐపీవో లిస్టింగ్ జరుగుతుండటంతో ఇతర రంగాల నుంచి పెట్టుబడులు అటువైపు మళ్లడం, లిక్విడిటీ సర్దుబాట్లు చోటుచేసుకోవడం మార్కెట్ల క్రాష్‌కు ఆజ్యం పోశాయి. మార్కెట్ల ఆకస్మిక పతనంతో మదుపర్ల సంపద భారీగా ఆవిరైంది.

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..
కృత్రిమ పన్నీరుపై ఏడాది పాటు నిషేధం



ఆంధ్రప్రదేశ్‌లో కృత్రిమ పన్నీరు, కృత్రిమ చీజ్‌ల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రభుత్వం ఏడాది పాటు నిషేధం విధించింది. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ఆహార భద్రతాశాఖ కమిషనర్ వీరపాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు

రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోటళ్లు, రెస్టారెంట్లలో పన్నీరు పేరుతో కృత్రిమ పన్నీరు, కృత్రిమ చీజ్‌ను వినియోగిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి నిషేధ ఉత్తర్వులను అమల్లోకి తెచ్చింది. పన్నీరు స్వచ్ఛత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆహార భద్రతాశాఖ డైరెక్టర్ సూచించారు. మార్కెట్లో విక్రయించే పన్నీరు, చీజ్ నాణ్యతను గమనించాలని సూచనలు చేశారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 29-10-2026

బస్వాపూర్ సర్పంచ్‌ను పరామర్శించిన

బిక్కనూర్ మండల సర్పంచులు

తుడుం రామయ్య మృతికి సంతాపం..



బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ మండలం బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మస్వామి తండ్రి తుడుం రామయ్య మృతి పట్ల బిక్కనూర్ మండల సర్పంచులు సంతాపం వ్యక్తం చేశారు. బస్వాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తుడుం పద్మస్వామిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిక్కనూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాల్యాల రేఖ సుదర్శన్, పెద్దమల్లారెడ్డి సర్పంచ్ సాయగౌడ్, మల్లుపేట సర్పంచ్ నారాయణ, కాచాపూర్ సర్పంచ్ జ్యోతి సంతోష్, అయ్యవారిపల్లి సర్పంచ్ సత్యం, రాగట్లపల్లి సర్పంచ్ నీలం రెడ్డి భాస్కర్, కంచర్ల సర్పంచ్ అరుణ స్వామి, ఇసనపల్లి సర్పంచ్ రాములు, కాంగ్రెస్ నాయకులు చింతనూరి సిద్ధరాములు, మామిడి చందు, గొల్లకొండ ఎల్లం, సోహైల్, మిద్దె ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులే

స్వయంగా రావాలి!



కాటారం, (సింగిడి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం (నేడు) ఉదయం 10 గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో, నోడల్ అధికారి అడ్డూరి బాబు తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ తమ సిబ్బందిని పంపకుండా, సంబంధిత అధికారులే స్వయంగా తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

రక్తదాతలకు

ఎస్సై నవీన్ చంద్ర చేయూత

8 మంది యువ రక్తదాతలకు హెల్మెట్లు అందజేత



బీబీపేట,(సింగిడి): పోలీసు అమరవీరుల సం స్మరణ దినోత్సవాల్లో భాగంగా రక్తదానం చేసిన ఎనిమిది మంది యువకులను బీబీపేట్ ఎస్సై నవీన్ చంద్ర అభినందించారు. ఆదివారం వారికి హెల్మెట్లు అందజేసి ప్రోత్సహిం చారు. కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో శనివారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఈ యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు అంకన్నగారి నాగరాజ్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్, కానిస్టేబుళ్లు ఫయాజ్, సుధీర్, మహేందర్, రక్తదాతలు అనిల్, కిషన్, బాలరాజు, శ్రీనివాస్, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో మార్పు..

రైతుకు లాభం..



బిక్కనూర్, (సింగిడి): రైతులకు అధిక ఆదాయం కల్పించేందుకు పంట మార్పిడిని ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగుకు రాయితీలు అందిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. గురజకుంట గ్రామంలో 58 మంది రైతులకు కూరగాయల సాగుకు ఎకరాకు రూ. 9,600, మల్చింగ్ విధానానికి రూ. 8,000 చొప్పున మొత్తం రూ. 17,600 వరకు రాయితీ అందించనున్నట్లు తెలిపారు. గ్రామ రైతులకు సుమారు రూ. 4 లక్షల మేర రాయితీలు మంజూరయ్యాయి. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అనుస రించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాయితీలు పొందిన రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి, షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగన్నగారి నరేందర్ రెడ్డి, గురజకుంట సర్పంచ్ సంతోష్ రెడ్డి, తిప్పాపూర్ సర్పంచ్ కుంట లింగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మీ సేవా నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి

టి.జి.ఎం.ఎఫ్ నిరంతర పోరాటం

నిర్వాహకుల హక్కులు, కుటుంబాల భద్రత, ఆర్థిక భరోసా కోసం ఐక్యంగా ముందుకు సాగాలి

టీ.జీ.ఎం.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు భైర శంకర్



దుగ్గొండి, (సింగిడి): మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ మీ సేవా ఫెడరేషన్ (టి.జి.ఎం.ఎఫ్) నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు భైరా శంకర్ తెలిపారు. వరంగల్‌లో ఆదివారం నిర్వహించిన టి.జి.ఎం.ఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మీ సేవా కేంద్రాల నిర్వాహకుల హక్కుల సాధన, ఆర్థిక భద్రత, సంక్షేమం కోసం సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్న వీఎల్ఈలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని భైరా శంకర్ తెలిపారు. కేంద్రాల నిర్వహణకు సంబంధించిన కమీషన్ల సమస్యలు పరిష్కరించాలని, నిర్వాహకులకు మరిన్ని కొత్త సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, ఆరోగ్య బీమా, సంక్షేమ పథకాలు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులంతా ఐక్యంగా ఉండాలని, తమ హక్కుల సాధన కోసం సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిర్వాహకుల కుటుంబాలకు భద్రత కల్పించడం, వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం, వృత్తిపరమైన గౌరవాన్ని కాపాడడం సంఘం ప్రధాన లక్ష్యాలని తెలిపారు. వీఎల్ఈల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా కమిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ మోహీద్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సామల రాకేష్, జిల్లా ఉపాధ్యక్షులు సాజిద్, లావణ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, జిల్లా కోశాధికారి నరేష్ పాల్గొన్నారు.సమావేశంలో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలు, కమీషన్లు, కొత్త సేవలు, ఆరోగ్య బీమా, సంక్షేమం, ఆర్థిక భద్రత తదితర అంశాలపై చర్చించారు. నిర్వాహకుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ప్రభుత్వానికి నివేదించాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. సమావేశాన్ని విజయవంతం చేసిన రాష్ట్ర కమిటీ ప్రతినిధులు, జిల్లా కమిటీ సభ్యులు, పాల్గొన్న వీఎల్ఈలకు టి.జి.ఎం.ఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి



తొర్రూరు, (సింగిడి): అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, పట్టణఅధ్యక్షులు ముద్దసాని సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉచిత ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపుకార్యాలయంలో కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఉమ్మడి వరంగల్–ఖమ్మం–నల్గొండఎమ్మెల్సీ ఓటు హక్కు పొందేందుకు అర్హులైన పట్టబద్రులందరూ ఓటు నమోదునిర్ణయిత సమయంలోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోకాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మొదటిప్రాధ్యన తో ప్రాధాన్యతతో ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలోఅధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే విద్యార్థుల నిరుద్యోగులు,ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పాలకుర్తి నియోజకవర్గం నుండికాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు చెవిటి సధాకర్, చిత్తలూరి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కాందాడి అచ్చిరెడ్డి, జక్కన్న మహబూబ్ రెడ్డి, తాళ్లపల్లిబిక్షం గౌడ్,ఎనగందుల శ్రీనివాస్, బసనబోయిన మహేష్ యాదవ్,కుషాల్‌చారి,తూర్పాటి రాంబాబు,చట్ల చంటి,,మాచర్ల అరవిందు,వల్లపు రాఘవులు,వెన్నంసోమిరెడ్డి,కర్ర అశోక్ రెడ్డి,అశోక్,యర్రం రాజు యాదవ్, నడిగడ్డ మధు,మందపురి శ్రీధర్,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు కూరగాయలు మొక్కజొన్న పంటలు వేయాలి

ఎలనినో ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి

నీటి లభ్యత తగ్గి భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి

వ్యవసాయ సహాయ సంచాలకులు ఆదిరెడ్డి





కమలాపూర్,(సింగిడి): రైతులు వచ్చే రబీ సిజన్లో వరి పంటను వేసుకోవద్దని ఆరుతడి పంటలు వందరోజుల పంటలు,కూరగాయలు, మొక్కజొన్న పంటలు సాగు వేసుకోవాలని హనుమకొండ జిల్లా సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు ఆదిరెడ్డి తెలిపారు. సాగుభూమి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండేడు, మర్రిపల్లి గూడెం, శనిగరం గ్రామంల్లో పంటలను పరిశీ లించారు. మర్రిపల్లిగూడెం గ్రామంలో వరి పంటను పరిశీలించి,వరి పంటలో వచ్చే తెగుళ్లను చీడపీడలను నివారించుటకు రైతులకు సూచనలు చేశారు. శనిగరం గ్రామంలో పత్తి పంట కోత ప్రయోగం ను పరిశీలించారు.అనంతరం గుండెడులో ఆదిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వలన ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగుతున్న, కారణంగా నీటి లభ్యత చాలావరకు తగ్గిపోతుందన్నారు. రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలన్నారు. వరి పంటను వేసుకోకూడదు అని సూచించారు. అలాగే మేల్ ఫిమేల్ వరి విత్తనాలను వేసినా కూడా పంట దిగుబడి చాలా వరకు తగ్గుతుందని రైతులకు సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వలన పాలినేషన్ తక్కువగా జరుగుతుంది కావున పంట దిగుబడి తగ్గిపోతుందని సూచించారు. జీరో తిలేజ్ మొక్కజొన్న పద్ధతిని సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా 100 నుండి110 రోజుల పంటలను మాత్రమే సాగు చేయాలని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటు పోతున్నందువల్ల నీటి లభ్యత తక్కువగా ఉంటుందని, కావున తక్కువ నీటిని వినియోగించే పంటలైనటువంటి మొక్కజొన్న, కూరగాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించి నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి వేణు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి తిరుపతి, జయప్రకాష్ రెడ్డి, ఆయాగ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు





నాటి స్నేహితులు.. నేటి కుటుంబాలు.. ఆత్మీయ సమ్మేళనం

గురువులకు ఘన సత్కారం..

సామూహిక షష్టిపూర్తి వేడుకలు



బిక్కనూర్, (సింగిడి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980–81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రామేశ్వర్‌పల్లిలోని రెడ్డి కల్యాణ మండపంలో కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి, పాదాభివం దనం చేశారు. పూర్వ విద్యార్థులు సామూహిక షష్టిపూర్తి మహోత్సవాన్ని నిర్వహించగా, వారి పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుంటూ, తమ స్నేహబంధాన్ని మరోసారి గుర్తుచేసుకున్నారు.

మండల అభివృద్ధికి మరింత కృషి చేయాలి..

కాంగ్రెస్ నాయకులకు షబ్బీర్ అలీ సూచన



బిక్కనూర్, (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని ఆదివారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిక్కనూర్ మండల అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మండల అభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మండల అభివృద్ధికి మరింత కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి రాజబాబు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగన్నగారి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నీల అంజయ్య, చిన్న మల్లారెడ్డి, నాగన్నగారి మల్లారెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధి సోయల్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్ నుంచి మృతదేహం తరలింపునకు ఎమ్మెల్యే చొరవ

మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు

నిర్మల్ ప్రతినిధి, పెంబి(సింగిడి): నిర్మల్ జిల్లా పెంబి మండలం ఎటిక్యాల గ్రామానికి చెందిన పాముల రవి దుబాయ్‌లో మృతి చెందడంతో, ఆయన మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహే శ్వర్ రెడ్డి కోరారు. దుబాయ్‌లోని టాప్లీమ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ ఎల్ఎల్సీలో క్లీనర్‌గా పనిచేస్తున్న రవి మృతి చెందినట్లు వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు, అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆయన మృతదే హాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి, మృతదేహాన్ని స్వగ్రామా నికి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. దుబాయ్ లో మృతి చెందిన నిర్మల్ జిల్లా వాసి పాముల రవి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు రావడానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర రెడ్డి చొరవ

ఎండాకాలానికి ముందే

నీటి గండం!

లెంకాలపల్లిలో అడుగంటిన భూగర్భ జలాలు

రెండు బోర్లు మంజూరు చేయాలి..

ఎమ్మెల్యేకు గ్రామస్థుల విజ్ఞప్తి.



నల్లబెల్లి, (సింగిడి): నల్లబెల్లి మండలం లెంకా లపల్లి గ్రామంలో తాగునీటి సమస్య రోజురో జుకూ తీవ్రమ వుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని నల్లాల బావిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీటి లభ్యత తగ్గిందని వాపోతున్నారు. అనలైన ఎండాకాలం ప్రా రం భం కాకముందే నీటి ఎద్దడి ఏర్పడటంతో రానున్న రోజుల్లో తాగు నీటి కోసం ఇబ్బందులు తప్పవేమోనని ఆందోళన చెందు తున్నారు.

ఎండిన చెరువు.. తగ్గిన నీటి మట్టం

ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో గ్రామంలోని ఐబీ ఊర చెరువు ఎండిపోయిందని స్థానికులు చెబుతున్నారు. చెరువులో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడంతో నల్లాల బావిలో నీటి మట్టం పడిపోయిందని పేర్కొంటున్నారు. సాధారణంగా వేసవిలో ఎదురయ్యే నీటి సమస్య శీతాకాలంలోనే తలెత్తడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై అసంతృప్తి

గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సక్రమంగా అందడం లేదని గ్రామస్థులు,ఆరోపిస్తున్నారు. బావిలో నీరు తగ్గిపోవడం, పథకం ద్వారా నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర వడంతో తాగునీటి అవసరాలు తీర్చుకోవడం కష్టంగా మారిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు గ్రామంలో పర్యటించి నీటి సమస్యకు గల కారణాలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించాలి.

నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వెంటనే స్పందించి లెంకాలపల్లి గ్రామానికి రెండు బోరుబావులు మంజూరు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. యుద్ధప్రా తిపదికన బోర్లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ కూడా జోక్యం చేసుకొని సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి గ్రామాన్ని నీటి ఎద్దడి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.వేసవిలో పరిస్థితి మరింత దిగజారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించడంతోపాటు ప్రత్యామ్నాయ నీటి వనరులను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మాయాజాలంలో తనదైన ముద్ర..

రాష్ట్రవ్యాప్తంగా 1,600కు పైగా ప్రదర్శనలు.. సేవా కార్యక్రమాల్లోనూ ముందంజ

బిక్కనూర్, (సింగిడి): పేద కుటుంబం నుంచి వచ్చి, పట్టుదలతో మ్యాజిక్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు బిక్కనూర్ మండలం కంచర్ల గ్రామానికి చెందిన సంతోష్. మ్యాజిక్ ప్రదర్శనలతో ప్రజలను అలరిస్తూ, సామాజిక సేవతో ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు.

శిక్షణతో మొదలైన ప్రస్థానం

హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 2016లో మ్యాజిక్ షో శిక్షణ పొందిన సంతోష్, 2017లో స్టేజ్ ప్రదర్శనలు ప్రారంభించారు. 2026 వరకు సుమారు 1,600కు పైగా షోలు నిర్వహించి గుర్తింపు పొందారు.

ప్రతి కార్యక్రమంలో ప్రత్యేకత





పుట్టినరోజు వేడుకలు, ప్రత్యేక సందర్భాలు, గెట్‌టుగెదర్‌లలో మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ప్రతి కార్యక్రమంలో కొత్తదనాన్ని చూపిస్తూ, తెలంగాణవ్యాప్తంగా తనదైన ముద్ర వేస్తున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సేవ



ప్రైవేట్ వేడుకలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ స్వచ్ఛందంగా ప్రదర్శనలు ఇస్తున్నారు. హరితహారం, ప్లాస్టిక్ నియంత్రణ వంటి అంశాలపై మ్యాజిక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన



తెలంగాణలోని 32 జిల్లాల్లో పర్యటించి మూఢనమ్మకాలు, బాణామతి, చేతబడులపై ప్రదర్శనలు ఇచ్చారు. మ్యాజిక్ వెనుక ఉన్న మెలకువలను వివరిస్తూ, ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.



సంపాదనలో 10 శాతం సేవకు



తన ప్రదర్శనల ద్వారా వచ్చే ఆదాయంలో 10 శాతం సమాజ సేవకు ఖర్చు చేయాలనే లక్ష్యంతో సంతోష్ ముందుకు సాగుతున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్లు అందించడంతో పాటు వృద్ధులు, అనాథలకు అన్నదానం చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి తనకు తోచినంత సహాయం చేస్తున్నారు.

నటనలోనూ ప్రతిభ

మ్యాజిక్‌తో పాటు నటనపై ఆసక్తితో ఎనిమిది షార్ట్ ఫిల్మ్స్‌లో, ఒక సినిమాలో నటించారు. కళాకారుడిగా మరింత గుర్తింపు పొందేందుకు కృషి చేస్తున్నారు.



కళకు కొత్త ఊపిరి



మ్యాజిక్ కళకు ఆదరణ తగ్గుతున్నప్పటికీ సంతోష్ వెనుకడుగు వేయడం లేదు. ప్రదర్శనల్లో వైవిధ్యాన్ని చూపిస్తూ కళను ప్రజలకు చేరువ చేస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ ఆత్మీయ సంబంధాలను కొనసాగిస్తున్నారు. వినోదంతో ప్రజలను అలరిస్తూ.. సేవతో ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ.. మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్న సంతోష్ ప్రస్థానం అభినందనీయం.

ఆశ్రమ పాఠశాల నుంచి ఉన్నత శిఖరాలకు..

ముగ్గురు విద్యార్థినులు.. మూడు విజయ ప్రస్థానాలు!

ఒకరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. మరొకరు హైకోర్టు న్యాయవాది.. ఇంకొకరు పీహెచ్‌డీ పరిశోధకురాలు

ప్రభుత్వ విద్యకు వన్నె తెచ్చిన పూర్వ విద్యార్థినులు.. ఉపాధ్యాయుల కృషికి నిదర్శనం.

నల్లబెల్లి, (సింగిడి): ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు పట్టుదల, కృషితో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని నల్లబెల్లి మండలం మూడు చెక్కులపల్లి బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థినులు,నిరూపి స్తున్నారు. ఒకరు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, మరొకరు తెలంగాణ హైకోర్టు న్యాయవాదిగా, ఇంకొకరు జాతీయ స్థాయి సాంకేతిక విద్యాసంస్థలో పీహెచ్‌డీ పరిశోధకురాలిగా ఎదిగి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. విభిన్న రంగాల్లో రాణిస్తున్న ఈ ముగ్గురి విజయ ప్రస్థానాలు ప్రస్తుత విద్యార్థినులకు స్ఫూర్తినిస్తున్నాయి.గ్రామీణ, గిరిజన ప్రాంతాల బాలికలకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వ,ఆశ్రమ,పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. చదువుతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించడంలో పాఠశాల విద్య ఎంతో దోహదపడుతోంది. ఈ నేపథ్యం లో మూడు చెక్కులపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న మంగ సింధుజ, అంగోతు ఆదిలక్ష్మి, అంగోతు మహాలక్ష్మి సాధించిన విజయాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థ ప్రాధాన్యాన్ని చాటిచెబుతున్నాయి.

1 సాఫ్ట్‌వేర్ రంగంలో మంగ సింధుజ.



వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం పెంచికలపేట్ గ్రామానికి చెందిన మంగ సింధుజ బెంగళూరులోని ప్రముఖ బహుళజాతి సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా,పనిచేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించి సాంకేతిక రంగంలో ఉద్యోగం సాధించడం ఆమె కృషికి నిదర్శనం. మారుతున్న సాంకేతిక రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె ప్రస్థానం కంప్యూటర్ రంగంలో స్థిరపడాలని ఆశించే విద్యార్థినులకు ప్రేరణగా నిలుస్తోంది.గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు కూడా ఆధునిక సాంకేతిక రంగాల్లో అవకాశా లను,అందిపుచ్చుకోగలరనే విషయా న్ని సింధుజ విజయ ప్రస్థానం తెలియజేస్తోంది. సరైన విద్య, నిరంతర సాధన, లక్ష్యంపై స్పష్టత ఉంటే ఉన్నత ఉద్యోగాలను సాధించవచ్చనే సందేశాన్ని ఆమె ప్రయాణం అందిస్తోంది.

2 న్యాయవాదిగా అంగోతు ఆదిలక్ష్మి.



మహబూబాబాద్ జిల్లా సాలార్ తండాకు చెందిన అంగోతు ఆదిలక్ష్మి మూడు చెక్కులపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. పాఠశాల విద్య నుంచి న్యాయవాద వృత్తి వరకు ఆమె సాగించిన ప్రయాణం గిరిజన బాలికలు ఉన్నత లక్ష్యాలను,నిర్దేశించుకోవడానికి స్ఫూర్తినిస్తోంది.న్యాయవాద వృత్తిలో కొనసాగడం ద్వారా న్యాయవ్యవస్థలో తమకంటూ ఒక స్థానం సంపాదించు కోవచ్చని ఆమె ప్రస్థానం తెలియజేస్తోంది. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించు కొని వాటి సాధనకు క్రమబద్ధంగా కృషి చేయడం విజయానికి పునాది అని ఆమె ప్రయాణం చాటిచెబుతోంది. ముఖ్యంగా బాలికలు తమపై తాము నమ్మకం పెంచుకొని ఉన్నత విద్యను అభ్యసిం చాలని ప్రోత్సహించే ఉదాహరణగా ఆమె నిలుస్తున్నారు.

3 ఎన్ఐటీలో పీహెచ్‌డీ పరిశోధకురాలిగా మహాలక్ష్మి.



మహబూబాబాద్ జిల్లా సాలార్ తండాకు చెందిన అంగోతు మహాలక్ష్మి ప్రస్తుతం భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పరిశోధకురాలిగా కొనసాగు తున్నారు. భవిష్యత్తులో ప్రొఫెసర్‌గా ఎది గి ఉన్నత విద్యారంగానికి సేవ చేయాల న్నది ఆమె లక్ష్యం. పరిశోధ నతోపాటు సాహిత్యంపై ఆసక్తి కనబరు స్తూ కవితలు, చిన్న కథల సంకలనాన్ని కూడా త్వరలో ప్రచురించేందుకు సిద్ధమ వుతున్నారు. మహాలక్ష్మి ప్రతి సంవత్సరం తాను చదువు కున్న ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తూ ప్రస్తుత విద్యార్థినులతో తన అనుభవా లను పంచుకుంటున్నారు. కష్టపడి చదవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశిం చుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని వారిని ప్రోత్సహిస్తు న్నారు. ఉన్నత విద్య, పరిశోధన, రచనా రంగాల్లో ముందుకు సాగుతున్న ఆమె ప్రస్థానం విద్యార్థినులకు బహుముఖ ప్రతిభకు ఉదాహరణగా నిలుస్తోంది.

పూర్వ విద్యార్థినులకు అభినందనలు.

ముగ్గురు పూర్వ విద్యార్థినులు సాధించిన విజయాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిజిలి రామయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్ బానోత్ దేవీలాల్, డిప్యూటీ వార్డెన్ వీరమ్మ, ఉపాధ్యాయులు బి. రవిలాల్, శాంతకుమారి, రామదేవి, పద్మ, కవిత, హట్టి, హరిశ్చంద్ర, వెంకన్న, బాలు, లక్ష్య, సాంబయ్య, పి. గోపాల్, జె. ఫకీరా, జె. జుమ్మిలాల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ముగ్గురికీ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు తమ పూర్వ విద్యార్థినుల విజయాలను ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాలని, ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో గౌరవప్రదమైన స్థానాలను, సంపాదిం చుకోవాలని ఉపాధ్యా యులు సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు అవకాశాలు కల్పిస్తే వారు కూడా వివిధ రంగాల్లో ప్రతిభ చాటగలరని ఈ ముగ్గురి విజయాలు స్పష్టం చేస్తున్నా యి. పాఠశాల విద్యార్థినుల కలలకు రెక్కలు తొడిగి, వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో విద్యాసంస్థల పాత్ర ఎంత ముఖ్యమో ఈ విజయ ప్రస్థానాలు తెలియజేస్తున్నాయి.

ఉపాధ్యాయుల కృషికి గుర్తింపు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శకత్వం కూడా కీలక పాత్ర పోషిస్తాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారి లక్ష్యాలకు అనుగుణంగా ప్రోత్సహించడం వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. మూడు చెక్కులపల్లి ఆశ్రమ పాఠశాల పూర్వ విద్యార్థినులు వివిధ రంగాల్లో రాణించడం పాఠశాల ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలుస్తోంది.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టాలి..



కాటారం, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని ఎంపీడీవో అడ్డూరి బాబు తెలిపారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో నీటి వృథాను అరికట్టడంతోపాటు ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం, చెరువులు, కుంటల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వా లని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. నీటి వనరు లను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు.

సాయిన్ని లక్ష్మయ్యకు కాంగ్రెస్ నాయకుల నివాళి



తల్లాడ, (సింగిడి): తల్లాడ మండలం గోపాలపేట గ్రామానికి చెందిన సాయిన్ని లక్ష్మయ్య ఇటీవల మృతి చెందారు. ఆదివారం గోపాలపేట గ్రామంలో నిర్వహించిన ఆయన దశదినకర్మ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై నివాళు లర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమం లో అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, గోపాలపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ తాళ్ల సుధారాణి, వెంకటి, నున్నా పెద్ద తిరుమలయ్య తదితరులు సాయిన్ని లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి



సూతనకల్, (సింగిడి): అర్హులైన పట్టభద్రులరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బోల్కా సైదులు అన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని అర్హులైన ప్రతి పట్టభద్రుడు నిబంధనల ప్రకారం తన పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచిం చారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. అర్హులైన పట్టబద్రులు ఓటరు నమోదును నిర్లక్ష్యంగా చేయకుండా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప స్వాములకు స్టీల్ ప్లేట్ల వితరణ

ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని నివారించేందుకే ఈ నిర్ణయం రుద్రాక్ష నరసింహచారి

తల్లాడ, (సింగిడి): మండల పరిధిలోని మంగాపురం గ్రామంలో అయ్యప్ప మాల దీక్షలో ఉన్న స్వాములకు ఆదివారం విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష నరసింహచారి స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు.తన తల్లిదండ్రులు, దాతలు రుద్రాక్ష అంజయ్య--వెంకటరమణల సహకారంతో స్వాములు అన్నభిక్ష స్వీకరించేందుకు వీలుగా ఈ స్టీల్ ప్లేట్లను అందజేశారు. మంగాపురం అయ్యప్ప స్వామి పీఠం గురుస్వామి చాపల వెంకటేశ్వర్లుకు నరసింహచారి చేతుల మీదుగా ప్లేట్లను బహూకరించారు. ఈ సందర్భంగా రుద్రాక్ష నరసింహచారి మాట్లాడుతూ, అయ్యప్ప స్వాములు 45 రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో కఠినమైన మాల దీక్షను చేపడతారని తెలిపారు. అయితే ప్రసాదాలు, అన్నభిక్ష స్వీకరించే సమయంలో ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగించడం వల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి ప్రతికూల ప్రభావాలు కలిగే అవకాశం ఉందన్నారు.స్వాముల ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే సత్సంకల్పంతో స్టీల్ ప్లేట్లను అందజేసినట్లు ఆయన వివరించారు. పునర్వినియోగించుకునే స్టీల్ ప్లేట్ల వినియోగం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్ప స్వాములు, భక్తులు, రుద్రాక్ష నరసింహచారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం | Singidi | గురువారం 29-10-2026

జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు గ్రాండ్ సక్సెస్

- 20రాష్ట్రాల నుండి తరలివచ్చిన 70మంది ప్రతినిధులు
- తెలంగాణ నుండి హాజరైన 100మంది సీనియర్ మహిళా జర్నలిస్టులు
- హోటల్ ప్లాజాలో కనుల పండుగలా సదస్సు



హైదరాబాద్, (సింగిడి):దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వేదికగా, అక్టోబర్ 23, 24 తేదీలలో రెండు రోజుల పాటు బేగంపేట్ లోని హోటల్ టూరిజం ప్లాజాలో జరిగిన ప్రతిష్టాత్మక జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సుకు అనూహ్య స్పందన దక్కింది. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) నేతృత్వంలో జరిగిన ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఖఐజెజే) ఆతిథ్యమిచ్చింది. ఉత్తరఖాండ్, లడఖ్, జమ్మూకాశ్మీర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్, ఒడిశా, కేరళ, వెస్ట్ బెంగాల్, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక, త్రిపుర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 170 మంది మహిళా జర్నలిస్టులు ఎంతో ఉత్సాహంగా ఈ సదస్సుకు హాజరవ్వడం విశేషం. శనివారం రోజు ఈ సదస్సును రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించగా, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ప్రారంభోపన్యాసం చేసారు. కర్ణాటక, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్లు అయేషా ఖానుమ్, కె. శ్రీనివాస్ రెడ్డి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బల్విందర్ సింగ్ జమ్ము, సోమసుందర్, జాతీయ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్,ఎస్. ఎన్. సిన్హా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాజీద్, ఉపాధ్యక్షులు వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణలు హాజరయ్యారు. ప్రముఖ పాత్రికేయురాలు స్వప్న సమన్వయకర్తగా వ్యవహరించారు. సదస్సు మొదటి రోజు, మొదటి సభలో "నూతన మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం జర్నలిస్టు సంఘాల పునర్నిర్మాణం" అనే అంశంపై వక్తగా, సుప్రసిద్ధ జాతీయ పాత్రికేయురాలు గీతా శేషు (ముంబాయి) హాజరయ్యారు. "పని ప్రదేశంలో మహిళా జర్నలిస్టులు -- మారుతున్న మీడియా వాతావరణంలో భద్రత, రక్షణ మరియు సవాళ్లు" అనే అంశంపై జరిగిన రెండవ సభలో ప్రముఖ "ది మినిట్" మీడియా డిప్యూటీ ఎడిటర్ పూజా ప్రసన్న (బెంగళూరు) వక్తగా హాజరయ్యారు. అదే రోజు సాయంత్రం జరిగిన సాంస్కృతిక సభకు ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుకేందర్ రెడ్డి, గౌరవ అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదాలు హాజరయ్యారు. అలాగే ఆదివారం రోజు జరిగిన మొదటి సమావేశంలో "మారుతున్న పరిస్థితుల్లో మహిళా జర్నలిస్టులు - సవాళ్లు " అనే అంశంపై వక్తగా చీఖఐఎ సౌత్ హెడ్ ఉమా సుధీర్ వక్తగా హాజరయ్యారు. "జర్నలిస్టుల కోసం కృత్రిమ మేధస్సు (ూ×) -- బాధ్యతాయుతంగా వినియోగించడం" అనే అంశంపై జరిగిన రెండవ సమావేశంలో, న్యూస్ మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఖనీజా గరారి వక్తగా హాజరయ్యారు. "నైతిక జర్నలిజం, భాషను బాధ్యతాయుతంగా ఉపయోగించడం -- మీడియా సమాచారంలో ఖచ్చితత్వం, నిష్పాక్షికత, సున్నితత్వం, విశ్వసనీయతను నిర్ధారించడం" అనే అంశంపై జరిగిన మూడవ సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం పూర్వ అధిపతి ప్రొఫెసర్ పద్మజాషా వక్తగా హాజరయ్యారు. ఆయా అంశాలపై జరిగిన చర్చలో మోడరేటర్లుగా సీనియర్ పాత్రికేయులు సి.వనజ, బిందుసింగ్, స్వప్న, బత్తిని దీప్తిలు వ్యవహరించారు. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలను టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణలు ఘనంగా సత్కరించారు. ఆదివారం సాయంత్రం ఆయా రాష్ట్రాల ప్రతినిధులను హైదరాబాద్ లోని పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ×జీఖ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కె. అజిత్ బఖయ మహిళా విభాగం నాయకులు కళ్యాణం రాజేశ్వరీ, అత్తలూరి అరుణ, ప్రతిభ, సాజీదా సన్ బఖయ రాష్ట్ర కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, వి. యాదగిరి, కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రాజేష్, కిరణ్, ఒబఖ అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






గొప్ప మనసు చాటుకున్న శ్రీరంగాపూర్ గ్రామస్తులు



శ్రీరంగాపూర్ (సింగిడి):
మానవత్వం చాటుకుంటూ ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలిచారు శ్రీరంగాపూర్ గ్రామస్తులు. శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన జేసీబీ రాజు అస్వస్థతకు గురై కిందపడిపోవడంతో గమనించిన స్థానికులు వెంటనే స్పందించారు. అతనికి ప్రథమ చికిత్స అందించి, కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న గ్రామస్తులను పలువురు అభినందించారు.

అల్వాల్ ఐ.జి. జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్

అల్వాల్, (సింగిడి): అల్వాల్ ఐ.జి. సర్కిల్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అల్వాల్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, జంక్షన్ అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు, వాహనదారులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గతంలో 2024జూన్ 28నమల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి అల్వాల్ ఐ.జి. సర్కిల్‌ను విస్తరించి అభివృద్ధి చేయాలని ధర్నా నిర్వహించి, ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జంక్షన్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి, వాహనదారులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే గారు గతంలో కృషి చేశారు.అనంతరం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ జంక్షన్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పురోగతిని సమీక్షించారు.అల్వాల్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, ఐ.జి. జంక్షన్ అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గతంలో చేసిన కృషి ఫలితంగా అభివృద్ధి పనులు ముందుకు సాగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కంబాల పరమేష్



ఆమనగల్లు , (సింగిడి):
తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్)ను కడ్తాల్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయిక అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, భవిష్యత్తు రాజకీయ పరిణామాలు, త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాత్మక ప్రణాళికలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, శ్రేణులను సమాయత్తం చేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

బాలికను దూషించి, సోదరుడిపై దాడి

-నిందితుడు రిమాండ్



చేవెళ్ళ (సింగిడి):
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కుర్వగూడ గ్రామంలో బాలికను అసభ్య పదజాలంతో దూషించి, అడ్డుకున్న ఆమె సోదరుడిపై దాడి చేసిన ఘటనలో నిందితుడిని షాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.. షాబాద్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో అక్టోబర్ 24న అదే గ్రామానికి చెందిన బాలిక నిందితుడి ఇంటి ముందు నుంచి వెళుండగా అసభ్యంగా దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన బాలిక సోదరుడితో వాగ్వాదానికి దిగిన నిందితుడు, సమీపంలో ఉన్న చెక్క కర్రతో బాలుడి తలపై, ఎడమ చెంపపై దాడి చేయడంతో గాయాలయ్యాయి.గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు షంషాబాద్‌లోని అర్కాన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ ఫిర్యాదు మేరకు షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.ప్రజలు వివాదాలను చట్టపరంగా పరిష్కరించుకో వాలని పోలీసులు సూచించారు.

మా భూములు మాకే కావాలి:

ఆమనగల్లు, (సింగిడి):
తమ జీవనాధారమైన వ్యవసాయ భూములను కాపాడాలంటూ ఇర్విన్ రిజర్వాయర్ భూ బాధిత రైతులు ఆందోళన బాట పట్టారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామం నుంచి ఎడ్లబండ్లతో భారీ ర్యాలీగా బయలుదేరి మాడ్గుల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎడ్లబండ్లతో కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం రిజర్వాయర్ నిర్మాణాన్ని రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా శ్రీరంగాపూర్‌లో వాల్మీకి మహర్షి జయంతి

శ్రీరంగాపూర్, (సింగిడి):శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చూపిన సత్యం, ధర్మం, న్యాయం, మానవతా విలువలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, వాల్మీకి సంఘం అధ్యక్షుడు కానపల్లి శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బోకలయ్య, రాజేంద్ర ప్రసాద్ యాదవ్‌తో పాటు వాల్మీకి సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి కేవలం రామాయణాన్ని రచించిన ఆదికవి మాత్రమే కాకుండా, సమాజానికి నైతిక విలువలు, సత్యనిష్ఠ, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని బోధించిన మహనీయుడని అన్నారు. ఆయన రచనలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.వాల్మీకి మహర్షి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, సమాజంలో ఐక్యత, విద్య, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జయంతి వేడుకల సందర్భంగా భక్తులు, ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారికి ప్రసాదం పంపిణీ చేశారు.



ఇరుకు రోడ్లతో వాహనదారులకు ఇక్కట్లు




తాటిపాములలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

శ్రీరంగాపూర్, (సింగిడి):వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన జీవితాన్ని, ఆదర్శాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వాల్మీకి సంఘం పెద్దలు, కుల పెద్దలు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ వెంకటయ్య నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు అరటిపండ్లను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు కూడా అరటిపండ్లు అందజేశారు. వాల్మీకి గ్రంథం వద్దకు చేరుకున్న ప్రజలకు సైతం పండ్లను పంపిణీ చేసి జయంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, చిన్నారులతో పాటు గ్రామ ప్రజల్లో వాల్మీకి మహర్షి పట్ల భక్తి, గౌరవాన్ని చాటుకున్నారు.ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్లు, ఎంపీటీసీ పార్వతంలో వెంకటయ్య నాయుడు, గ్రామ పెద్దలు, వాల్మీకి సంఘం నాయకులు, యువకులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ వెంకటయ్య నాయుడు మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా పాదాభివందనాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను ఐకమత్యంతో నిర్వహిస్తూ వాల్మీకి మహర్షి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.



ఇంట్లోకి చొరబడి దాడి, చేసిన ముగ్గురు నిందితులు రిమాండ్

చేవెళ్ళ (సింగిడి):
మొబైల్ ఫోన్ వివాదం నేపథ్యంలో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి దాడి చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.. షాబాద్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన,వివరాల ప్రకారం.. అక్టోబర్ 22 రాత్రి 9 గంటల సమయంలో షాబాద్ మండలం నాగర్‌గూడలో మొబైల్ ఫోన్ విషయంలో వివాదం తలెత్తింది. దీంతో రేగడి దోస్వాడ గ్రామానికి చెందిన వ్యాపారి ఆర్తా శ్రీనివాస్ రెడ్డి (38) ఇంట్లోకి అతని డ్రైవర్ ఖలీల్ తన బావమరిదులు ఆదిల్ (23), అద్నాన్ (22)తో కలిసి అక్రమంగా ప్రవేశించి కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో శ్రీనివాస్ రెడ్డితో పాటు అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయన కుటుంబ సభ్యులు, సోదరుడు శేఖర్ రెడ్డి గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నిందితులు ఖలీల్, ఆదిల్, అద్నాన్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.వ్యక్తిగత వివాదాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని షాబాద్ పోలీసులు ప్రజలకు సూచించారు.



జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలి

-డీఎస్పీ కార్యాలయ తరలింపుపై బీజేపీ నిరసన



జిన్నారం, (సింగిడి):
జిన్నారం మున్సిపల్ కేంద్రంలోనే డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, ఇక్కడి నుంచే పోలీసు పరిపాలన కొనసాగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం జిన్నారం కేంద్రంగా కార్యాలయం ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఉమ్మడి జిన్నారం మండల బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేసి, జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, బీజేపీ నాయకులు కురుపల్లి నర్సింగరావు, కొత్తకాపు జగన్ రెడ్డి, రాజిరెడ్డి, మద్దూరి రాజు, కౌన్సిలర్లు స్వప్న రాజేందర్ రెడ్డి, వై. కుమారస్వామి, బి. వెంకటేష్, విజయలక్ష్మి రాజిరెడ్డి, వంగేటి రాజిరెడ్డి, అశోక్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

-విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం
- ఎస్సై వెంకటేశ్వర్ గౌడ్



పెబ్బేరు (సింగిడి):
వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేరు తెలంగాణ మోడల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.బాల్యవివాహాల నిరోధక చట్టం, లైంగిక నేరాల నుంచి బాలలను రక్షించే పోక్సో చట్టం--2012, న్యాయ సహాయ సేవలు, చట్టాల పరిధి, వాటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. బాలల హక్కులకు భంగం కలిగించే చర్యలపై అప్రమత్తంగా ఉండాలని, చట్టం కల్పించిన రక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెబ్బేరు ఎస్సై వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్న దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బయట ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, అనుచిత ఘటనలు చోటుచేసుకున్నా భయపడకుండా తల్లిదండ్రులకు ధైర్యంగా తెలియజేయాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే హక్కులను పరిరక్షించుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. సమాజంలో ఎక్కడైనా చట్టవిరుద్ధమైన ఘటనలు చోటుచేసుకుంటే వాటిపై అవగాహనతో స్పందించాలని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ తూర్పింటి నరేశ్ కుమార్ మాట్లాడుతూ సమస్యలను దాచిపెట్టకుండా పెద్దల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తగిన సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాయసహాయ రక్షణ న్యాయవాది కృష్ణయ్య, సహాయ న్యాయ రక్షణ న్యాయవాది శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, పెబ్బేరు ఎస్సై వెంకటేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం

ఇబ్రహీంపట్నం,(సింగిడి):ఉమంచాల మండలం దాద్ పల్లి గ్రామం లో శ్రీశ్రీశ్రీ ఈశ్వర రామాంజనేయ స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా దేవాలయంలోపూజా కార్యక్రమాలు కుంభాభిషేకాలు మంగళ హారతి మహా నివేదన అభిషేకాలతో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాదాలు సాయంత్రం భక్త సురేష్ గారి ప్రవచనాలు దేవాలయ ప్రాంగణంలో సాయంత్రం స్వామివారి ఊరేగింపులు గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించినారు. భక్తులతో దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది.దేవాలయ కమిటీ చైర్మన్ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ శాంతి రాజు నాయక్ మాజీ నైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



ఆదివాసీల హక్కుల కోసం భీం పోరాటం చిరస్మరణీయం

- ఆశయాల సాధనకు కృషి చేయాలి
- మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, సీతక్క





కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి): ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన కొమురం భీం త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దనసరి సీతక్క అన్నారు. కొమురం భీం 86వ వర్ధంతి సందర్భంగా సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహిం చిన కార్యక్రమంలో వారు భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంద న్నారు. మారుమూల గ్రామాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపరుస్తామని తెలిపారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి, ఐటీడీఏ లకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామ న్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ జల్--జంగల్--జమీన్ కోసం పోరాడిన కొమురం భీం ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. గిరిజనుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లతో పాటు రహదారులు, తాగునీరు, విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు, రహదారుల కోసం రూ.180 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షిస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కెరమెరి సమీపంలో రూ.60 కోట్లతో ఇంట ర్‌వెల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్పీ నిఖితా పంత్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఐటీడీఏ పీఓ మంద మకరందు గోండి భాషలో ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు,ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేశారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. గుస్సాడీ, చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కొమురం భీం మనుమడు కొమురం సోనే రావు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పోలీసుల విధులు.. బాధితులకు భరోసా!

-ఓపెన్ హౌస్‌తో విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన



పెద్దపల్లి, (సింగిడి): ప్రజల రక్షణ, బాధితులకు న్యాయం, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని చాటిచెప్పేలా పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలను వివరించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై పోలీసులు స్పందించే తీరు, సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలు, ప్రజలకు అందించే సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ వ్యవస్థపై నమ్మకం, గౌరవం పెంపొందించడంతో పాటు ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని వివరించారు. విద్యార్థులు పోలీసుల విధులను ప్రత్యక్షంగా తెలుసుకునేలా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి

-పాల్గొన్న అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు



నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఒక బోయవాడు గొప్ప కవిగా ఎలా మారాడో వాల్మీకి జీవితమే ఉదాహరణ అని చెప్పారు. ఆయన వల్లనే రామతత్వం అందరికీ బోధపడిందని, ఆయన రచించిన ఏడు కాండాల రామాయణం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఆయన జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బిసి అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, డిఈవో భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎల్డిఎం రామ్ గోపాల్, సహాయ బిసి అభివృద్ధి అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా వాల్మీకి సంఘ ప్రతినిధులు ఆకుల సుదర్శన్, వేల్పుల మల్లేష్, ఎండపల్లి అశోక్, ఆకుల రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు కూలితే.. ప్రమాదం ఎవరి బాధ్యత?

భయం భయంగా సాయి నగర్ వాసులు



మంచిర్యాల, (సింగిడి):ప్రజల రాకపోకలకు కీలకంగా ఉండాల్సిన కల్వర్టు.. ఇప్పుడు ప్రమాదానికి చిరు నామాగా మారింది. ఎప్పుడు కూలిపో తుందోనన్న భయం.. ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో నన్న ఆందోళన.. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ సాయినగర్ వాసులను వెంటాడుతున్నాయి. శిథిలావస్థకు చేరిన కల్వర్టుతో స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలకు ఇబ్బందులు పడటమే కాకుండా.. ప్రమాదం జరిగితే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన వారిని కలవరపెడుతోంది.సాయినగర్ ప్రాంతంలో ఉన్న ఈ కల్వర్టు మీదుగా స్థానికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు సహా అనేక మంది ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారు. కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో దానిపై ప్రయాణించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఈ మార్గంలో వెళ్లే సమయంలో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదం జరిగాక స్పందిస్తారా?

కల్వర్టు పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. ప్రజల భద్రతకు ముప్పుగా మారిన నిర్మాణాన్ని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముందుగానే చర్యలు తీసుకుంటే ప్రాణనష్టాన్ని నివారించవచ్చని అభిప్రాయ పడుతున్నారు.ప్రజల రాకపోకలకు భరోసా కల్పించాల్సిన కల్వర్టు.. వారి ప్రాణాలకు ముప్పుగా మారకూడదని సాయినగర్ వాసులు ఆశిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి, తమ భయాలను తొలగించాలని కోరుతున్నారు.

సంక్షేమానికి డిజిటల్ బాట : మేయర్ మధుకర్



మంచిర్యాల, (సింగిడి):
ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందాలంటే రేషన్ కార్డు కీలకంగా మారింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడంతో పాటు, ప్రజలకు అవసరమైన సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ పేర్కొన్నారు.మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7, 29, 30, 31, 32వ డివిజన్లలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆయా పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంలో తెల్ల రేషన్ కార్డు ఎంతో ముఖ్యమని వివరించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరుగుతుందని మేయర్ తెలిపారు. అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందించడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభతరంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

కార్మిక హక్కుల కోసం హైదరాబాద్‌కు మున్సిపల్ కార్మికుల కదం

- రూ.42 వేల కనీస వేతనం..
- నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం మహా ధర్నా..
- జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఉపాధ్యక్షులు
- తాండ్ర అంజయ్య



సుల్తానాబాద్, (సింగిడి):
మున్సిపల్ కార్మికుల హక్కుల సాధన కోసం సు ల్తానాబాద్ కార్మికులు హైదరాబాద్ బాట పట్టారు. సీఐటీ యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాలో పాల్గొనేందుకు బయలుదేరిన కార్మికుల వాహనాలను సీఐటీ యూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా తాండ్ర అంజయ్య మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు కార్మిక చట్టాల కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ.42 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పిం చాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్మికు లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనా డాలని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివే యాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ సంఘం జిల్లా అధ్య క్షుడు పాక మహేష్, మున్సిపల్ సంఘం అధ్యక్షుడు న్యాతరి రమేష్, ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి సురేష్, లక్ష్మి, కలవల శీను, కొమ్మగళ్ల బాబు, సది, రాములు, రామ్మూర్తి, లక్ష్మణ్, అనిల్, కుమార్, సత్యం, మహంకాళి మల్లేష్, గంగవ్వ, సునీత, ఓదెలుతో పాటువీరగోని కిరణ్ గౌడ్, రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటితోనే ఆరోగ్య పరిరక్షణ



కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి):
కలుషిత నీటితో తలెత్తే ఆరోగ్య సమస్యలను నివారించడమే లక్ష్యంగా కెరమెరి మండలం గోయగం గ్రామంలో చేపట్టిన మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్టును రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని జోడేఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో ఆమె ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో కిడ్నీ సంబంధిత సమస్యలు, ముఖ్యంగా దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు గుర్తించిన నేపథ్యంలో ప్రాజెక్టును చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత మంత్రికి వివరించారు. గోయగంతో పాటు మరికొన్ని గ్రామాల ప్రజలు ఇటీవల మిషన్ భగీరథ నీటిని తాగడం లేదని తెలిపారు. ఇటువంటి ఆరోగ్య సమస్యలను నివారించేందుకు నీటిని శుద్ధి చేసి సరఫరా చేయడం ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిని శుద్ధి చేసి గ్రామస్థులకు అందించడం మంచి ఆలోచన అన్నారు. రసాయనాలతో కలుషితమైన నీటిని వినియోగించకుండా, శుద్ధి చేసిన నీటినే తాగాలని సూచించారు. ఈ ప్రాజెక్టును విజయవంతం చేసి, ఇతర గ్రామాలకూ విస్తరించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అలా అభివృద్ధి సాధించిన గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.కోటి వరకు నిధులతో పాటు అవార్డులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్, ఎస్పీ నికిత పంత్, కాంగ్రెస్ నాయకులు శ్యాం నాయక్, సుగుణక్క, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, గోయగం సర్పంచి ఆత్రం ఆనంద్ రావు, ఉప సర్పంచి మొహర్లే రాందాస్, పంచాయతీ కార్యదర్శి ఎం.మురళీధర్, నీతి ఆయోగ్ సమన్వయకర్త డాక్టర్ బాలరాజు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దంపేట భూముల పట్టాల సమస్యకు పరిష్కారం చూపాలి

- అర్హులైన ప్రతి రైతుకు పట్టా ఇవ్వాలి.. కలెక్టర్‌కు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి
- ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను తక్షణమే పరిష్కరించాలి
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



గోదావరిఖని, (సింగిడి):
పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలం రాయదండి రెవెన్యూ శివారులో ఉన్న పెద్దంపేట గ్రామ కూర్స్ కమ్మి భూముల సమస్యను పరిష్కరించి, అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కోరారు.దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. భూములకు సంబంధించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పట్టాల మంజూరు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టి బాధితులకు ఉపశమనం కల్పించాలని కోరారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యపై అవసరమైన చర్యలు త్వరితగతిన చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో పెద్దంపేట భూముల పట్టాల సమస్య పరిష్కారంపై స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధికార ప్రతినిధి, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు పెండ్యాల మహేష్ పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



నిర్మల్ ప్రతినిధి,బాసర (సింగిడి):
సోమవారం బాసర మండలంలోని మధాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి గ్రామంలో చేపట్టిన రీసర్వే గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది తప్పనిసరి క్షేత్రస్థాయి సర్వే సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. సర్వే నిర్వహణకు సంబంధించిన రైతులకు సమాచారం ముందుగానే అందించాలన్నారు. సంబంధిత కమతాల రైతులంతా సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలని వివరించారు. సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు.ఈ పరిశీలనలో ఖైసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడిఓ దేవేందర్ రెడ్డి, రెవెన్యూ, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శరద్ పౌర్ణమి వేడుకలు.. శివాలయంలో భక్తుల సందడి

- కోజాగరన పౌర్ణమి విశిష్టతను వివరించిన అర్చకులు వల్లకొండ రమేష్



సుల్తానాబాద్, (సింగిడి):
సుల్తానాబాద్ పట్టణంలోని పురాతన శ్రీ శివాల యంలో ఆదివారం రాత్రి కోజాగరన పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ, అర్చ కులు, ఆధ్యాత్మిక మార్గదర్శకులు వల్లకొండ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు దూడం లింగమూర్తి, చేపూరి రవీందర్ గౌడ్, గందె రాజుతో పాటు భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అర్చకులు ఆశ్వ యుజ పౌర్ణమి విశిష్టతను వివరిస్తూ, కోజాగరన పౌర్ణమిని ఆధ్యాత్మికతకు, ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. ఈ రాత్రి లక్ష్మీదేవి అనుగ్రహం కోసం భక్తులు జాగరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. చంద్రబింబాన్ని పాలలో దర్శించి పూజించడం, పాలను ప్రసా దంగా స్వీకరించడం సంప్రదా యమని వివరిం చారు. ఈ పర్వదినం కుటుంబాల్లో శాంతి, సౌఖ్యం, ఆయురా రోగ్యాలు కలగాలని ప్రార్థించే పవిత్ర సందర్భమని పేర్కొన్నారు.సర్వే జనాః సుఖినో భవంతు.. అందరూ సుఖసంతో షాలతో, ఆరోగ్యంగా ఉండాలనే సందేశంతో వేడుకలు ఆధ్యాత్మిక వాతావర ణంలో ముగిశాయి.

ఓట్ల గల్లంతుపై కాంగ్రెస్ సమరం



పెద్దపల్లి, (సింగిడి):
రాష్ట్రంలో 73 లక్షల ఓట్లు గల్లంత య్యాయని రామగుండం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు పర్యవేక్షణలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓటు బచావో.. దేశ్‌కో బచావో' సభకు జర్నలిస్టులు, యువత, విద్యార్థులు, ప్రజా స్వామ్యవాదులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని మక్కాన్‌సింగ్ పిలుపునిచ్చారు.పెద్దపల్లిలోని ఆర్ ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటి సరఫరా, రైతుల సంక్షేమం, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు తమ వైఖరిని వెల్లడించారు.ఎస్‌ఆర్‌ఎస్‌పి కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తున్నామని మక్కాన్‌సింగ్ తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గుండారం, కుక్కలగూడూరు ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.గత బి ఆర్ ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని మక్కాన్‌సింగ్ విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, సన్నధాన్యానికి బోనస్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామని వివరించారు.కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని, ఎస్ ఐ ఆర్ పేరుతో తెలంగాణలో 73 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని రాష్ట్రప్రభుత్వవిప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆరోపించారు. ఓటు ప్రతి పౌరుడి హక్కు అని, ఓట్ల తొలగింపు అనైతిక చర్య అని పేర్కొన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎంత మేర సాగునీరు అందించారో కేటీఆర్ వెల్లడించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినగా, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు ఏర్పడ్డాయని విమర్శించారు. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు బ్యారేజీల మరమ్మతులు చేపట్టి, పనులు పూర్తి చేస్తామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్ట నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. ఎస్సారెస్పీ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు పలు ప్రాజెక్టులను కాంగ్రెస్ నిర్మించిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిరాధార వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.కాంగ్రెస్ నాయకులు ఓట్ల చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ ఏడాది క్రితమే ఉద్యమం ప్రారంభించారని సర్ ఉమ్మడి జిల్లా పరిశీలకుడు శరత్ తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటర్ల జాబితా, ఓట్ల నమోదుపై పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటిం చారు. రామగుండం మేయర్ మహంకాళి స్వామి, టీపీసీసీ పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్, రామగుండం కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి.ముస్తాఫా, పెద్దపల్లి కౌన్సిలర్ మాతంగి నర్సింగ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్, మార్కెట్ చైర్మన్లు, కార్పొరేటర్లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సింగల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల, పట్టణాల, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తదితరులున్నారు.

singidinews@gmail.com

కుర్రకారు గుండెల్లో వేద్విక అందం

వేద్వికా సోనీ భారతీయ నటి, మోడల్. ప్రధానంగా తెలుగు, కన్నడ, పంజాబీ చిత్రాలతో పాటు మోడలింగ్, ఫ్యాషన్ రంగాల్లో గుర్తింపు పొందుతున్నారు.

వ్యక్తిగత వివరాలు

- పూర్తి పేరు: వేద్వికా సోనీ
- జన్మస్థలం: జునాగఢ్, గుజరాత్
- పెరిగిన ప్రాంతం: అహ్మదాబాద్
- జాతీయత: భారతీయురాలు
- విద్యార్హత: బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ (వీదీూ)
- స్పెషలైజేషన్: హ్యూమన్ రిసోర్సెస్ (ఎ=)
- విశ్వవిద్యాలయం: గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ
- వృత్తి: నటి, మోడల్
- సినీ రంగ ప్రవేశం: 2019లో మోడలింగ్ ద్వారా కెరీర్ ప్రారంభం

సినీ ప్రయాణం

వేద్వికా సోనీ 2019లో కళాశాలలో చదువుకుంటున్న సమయంలోనే మోడలింగ్ రంగంలో అడుగుపెట్టారు. ఫ్యాషన్ షోలు, ఫొటోషూట్లు, వాణిజ్య ప్రకటనల్లో పాల్గొంటూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. మోడలింగ్‌తో పాటు థియేటర్‌లోనూ అనుభవం సంపాదించారు.

ప్రధాన చిత్రాలు:

1. ధమాకా (2022): రవితేజ నటించిన ఈ చిత్రంలో చిన్న పాత్రలో కనిపించారు.
2. స్పార్క్ (2023): విక్రాంత్, మెహరీన్ పిర్జాదా నటించిన ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు.
3. పింకీ మోగే వాలీ: పంజాబీ చిత్రంలో నటించారు.
4. మత్తురా కన్నడ చిత్ర పరిశ్రమలోనూ నటిగా గుర్తింపు పొందారు.
5. అమరావతి పోలీస్ స్టేషన్ ఆమె నటించిన మరో చిత్రం.

ఆసక్తులు, అభిరుచులు

నటనతో పాటు ఫ్యాషన్, ప్రయాణాలు, పుస్తక పఠనం, వంట చేయడం వంటి విషయాలపై ఆసక్తి కలిగి ఉన్నారు. గుజరాతీ, హిందీ భాషలతో పాటు తెలుగు భాషను కూడా నేర్చుకున్నారు. తెలుగు చిత్రాల్లో నటించేందుకు భాషపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

తెలుగు సినీ పరిశ్రమలో గుర్తింపు

గుజరాత్ నుంచి వచ్చి హైదరాబాద్‌ను తన సినీ కెరీర్‌కు కేంద్రంగా మార్చుకున్న వేద్వికా సోనీ, మోడలింగ్ నుంచి నటన వరకు తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తెలుగు చిత్రాలతో పాటు ఇతర భాషల సినిమాల్లోనూ అవకాశాలు అందిపుచ్చుకుంటూ నటిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు.

కరోనా సమయంలో తెలుగు చిత్ర పరిశ్రమపై ఆసక్తి పెంచుకున్న ఆమె, అనంతరం హైదరాబాద్‌కు వచ్చి సినీ అవకాశాల కోసం ప్రయత్నించారు.



సిన్మా సింగిడి
Cinma Singidi
గురువారం
29-10-2026



ఐటీ కంపెనీల్లో వెట్టిచాకిరీ..

కేంద్రంపై ఆర్.నారాయణమూర్తి సంచలన వ్యాఖ్యలు

ఐటీ కంపెనీలు యువతతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని, సమయ పాలన లేకుండా శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వడం లేదని ప్రముఖ నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణ మూర్తి సంచలన వ్యాఖ్యలు చేశారు. పని హక్కు కాల రాయబడుతోందని ఇవాళ ఉన్న కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను వారి హక్కులను నిర్వీర్యం చేస్తోందని హాట్ కామెంట్స్ చేశారు. తాజాగా హైదరాబాద్?లో నిర్వహించిన హుషారు-2 సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్?లో మాట్లాడిన ఆయన... నేటి యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యతో పాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగుల పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. భారతదేశంలో ప్రస్తుతం బర్నింగ్ ఇష్యూ అయిన నిరుద్యోగ సమస్యను ఈ సినిమాలో ప్రస్తావించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం అవుతున్నాయని, రిజర్వేషన్లన్నీ కోల్పోతున్నామన్నారు. కార్పొరేట్, విదేశీ కంపెనీలు ఇవాళ రూల్ చేస్తున్నాయని, అలాంటి కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగుల చేత గంటల తరబడి పని వెట్టిచాకిరీ చేయించుకుని శ్రమకు తగిన ఫలితం ఇవ్వడం లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికులు 44 హక్కులు సాధించుకున్నారో ఆ హక్కులు కోల్పోతున్నారన్నారు. ఇవాళ ఉన్న కేంద్రంలో ఉన్న ప్రభుత్వం లేబర్ కోడ్ పేరుతో మొత్తం కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తోందన్నారు.

ఇకపై నటనపైనే నా దృష్టి..

సెకండ్ ఇన్నింగ్స్‌పై సీనియర్ నటి వైరల్ కామెంట్స్



సినిమా రంగంలో "బాపు బొమ్మ"గా... టివి రంగంలో "పుత్తడిబొమ్మ"గా సుప్రసిద్ధురాలైన దివ్యవాణి (కె. దివ్యవాణి చౌదరి)... రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు. మరోవైపు "పే బ్యాక్ టు సొసైటీ" అనే నినాదం స్ఫూర్తితో సమాజానికి తన వంతు సేవా కార్యక్రమాలు విరివిగా చేస్తున్నారు. అయితే ఇకపై రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ సినిమా రంగంపై దృష్టి సారించాలని దృఢ నిశ్చయం తీసుకున్నానని చెబుతున్నారు. "పెళ్ళి పుస్తకం, ఎదురింటి మొగుడు - పక్కింటి పెళ్ళాం" వంటి చిరస్మరణీయ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో స్థిర స్థానం సంపాదించుకున్న దివ్యవాణి... "పుత్తడి బొమ్మ" టివి సీరియల్ తోనూ ఉర్రూతలూగించారు. అంతేకాదు... కన్నడలోనూ పలు చిత్రాల్లో నటించి... అక్కడి ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలైన ఈ అందాల భామ... కన్నడ అనర్గళంగా మాట్లాడతారు. ఈ పాన్ ఇండియా యుగంలో.. రెండు మూడు భాషల్లో పాపులారిటీ కలిగిన ఆర్టిస్టులకు దర్శకనిర్మాతలు పెద్ద పీట వేస్తున్న నేపథ్యంలో... దివ్యవాణి మళ్లీ రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవ్వడంతో.. ఆమెకు మంచి ఆఫర్లు రావాలని ఆశిస్తున్నారు నెటిజన్లు.

'నాన్నకుట్టి' డిజిటల్ హక్కులు సొంతం చేసుకున్న ప్రముఖ ఓటీటీ సంస్థ

తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ఆవిష్కరించే కథతో తెరకెక్కుతున్న చిత్రం 'నాన్నకుట్టి'. మారన్ రచన చేస్తూ, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విజయ్ ఆంటోనీ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన గ్లింప్స్‌తో పాటు, అన్నీ అప్డేట్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగా.. తాజాగా వచ్చిన మొదటి సాంగ్ కూడా ఆడియన్స్ నుంచి విశేష స్పందన సొంతం చేసుకుంది. ఇలా విడుదలకు ముందే పాజిటివ్ బజ్ క్రియేట్ అయిన ఈ సినిమా తాజాగా ఓటీటీ డీల్ కూడా కంప్లీట్ చేసుకుంది. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా వెల్లడిస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ను షేర్ చేసింది. కాగా.. విజయ్ ఆంటోని ఫిలిమ్స్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీ ఈ ఏడాది దీపావళి స్పెషల్‌గా నవంబర్ 06న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో సందడి చేసేందుకు సిద్ధం అయింది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737